## లంచగొండుల వివరాలు ఎసిబికి తెలపండి

ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నట్లు, లంచగొండితనానికి పాల్పడుతున్నట్లు ఎలాంటి సమాచారమున్నా అవినీతి నిరోధక శాఖకు తెలయజేయ వలసిందిగా ఎసిబి డైరెక్టర్ జనరల్ ప్రజలను కోరారు. సమాచారం అలందించిన వారుపేరు, వివరాలను గోప్యంగా ఉంచుతామని ఒక ప్రకటనలో తెలిపారు.

**వివరాలకు:**

**డైరెక్టర్ జనరల్, అవినీతి నిరోధక శాఖ,**
**మొజంజాహి మార్కెట్ రోడ్, హైద్రాబాద్ -500 001**
**ఫోన్: (040) 2475132,**


# దేశ టైమ్స్

DESHA TIMES
TELUGU DAILY

తెలుగు దినపత్రిక


## హైదరాబాద్‌లో 'కలైడో ఖేల్-ఏ-థాన్'

హైదరాబాద్, : పరిమితులు కేవలం శరీరానికే తప్ప.. సాధించాలనే సంకల్పానికి కావని నిరూపించింది 'కలైడో ఖేల్-ఏ-థాన్'. ది గుడ్ టాక్ ఫ్యాక్టరీ ఆధ్వర్యంలో ఉదయం నెక్లెస్ రోడ్‌లో నిర్వహించిన 'ఆన్ ఇంక్లూజివ్ స్పోర్ట్స్ 4 ఆల్ 5కె రన్' నగర వాసులను విశేషంగా ఆకట్టుకుంది."క్రీడలు అందరి సొంతం" అనే నినాదంతో సాగిన ఈ పరుగులో కుల, మత, వయో భేదాలు లేకుండా వందలాది మంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పరుగును ఉద్దేశించి వ్యవస్థాపకులు రఘు మాట్లాడుతూ.. సమాజంలో సమ్మిళిత భావాన్ని పెంపొందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. దివ్యాంగులు, వృద్ధులు, చిన్నారులను ఒకే వేదికపైకి తీసుకురావడం ద్వారా క్రీడల పట్ల మక్కువ ఉన్న ప్రతి ఒక్కరికీ భరోసా కల్పించవచ్చని ఆయన ఆకాంక్షించారు.


నల్లగొండ సంపుటి:16 సంచిక:99 ఎడిటర్: సయ్యద్ పాష 28-04-2026 మంగళవారము పేజీలు :8 వెల:1/-


# ప్రజలకు జవాబుదారీగా ఉంటాం



ఖమ్మం,: ప్రభుత్వ సేవలు ప్రజల ముంగిటకే చేరాలనే సంకల్పంతో, పాలేరు నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సరికొత్త బాటలు వేస్తున్నా రు. సామాన్యులు తమ చిన్నపాటి అవసరాల కోసం కూడా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లు అరిగేలా తిరగకూడదన్న ధ్యేయంతో చేపట్టిన 'ప్రజా దర్బార్' కార్యక్రమం నేడు రెండు ప్రధాన కేంద్రాల్లో జరగనుంది. కూసుమంచి, ఖమ్మం రూరల్ మండలాల్లోని 25 గ్రామాలకు చెందిన ప్రజల కోసం అధికారులు క్షేత్రస్థాయికి రానున్నారు. నేడు పాలేరులో కూసు మంచి మండలం పాలేరులోని జవహర్ నవోదయ విద్యాలయ ఆవరణలో ప్రజా దర్బార్ ప్రారంభం కానుంది. ఈ కేంద్రానికి పాలేరు, నాయకన్ గూడెం, భగవత్వీడు తండా, మంగళ్ తండా, కొత్తూరు, నర్సింహులగూడెం, సంధ్యా తండా, లాల్ సింగ్ తండా, గైగోల్లపల్లి, బోడి యా తండా, చౌటపల్లి, ఎర్రగడ్డ తండా సహా 13 గ్రామ పంచాయతీల ప్రజలు హాజరు కావచ్చు.వేదికపైనే పరిష్కారం.. జిల్లా కలెక్టర్ నేతృత్వంలో రెవెన్యూ, విద్యుత్, పౌర సరఫరాలు, పంచాయతీరాజ్ సహా అన్ని శాఖల అధికారులు ఈ వేదికలపై అందు బాటులో ఉంటారు. ప్రధా నంగా భూ సమస్యలు, ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డుల దరఖాస్తులను తక్షణమే పరిశీలించి, పరిష్కార దిశగా చర్యలు చేపట్టాలని మంత్రి అధికారులకు సూచించారు. "ప్రతి విన్న పాన్ని నేరు గా పర్యవేక్షిస్తాం.. ప్రజలకు జవాబు దారీ గా ఉంటాం'' అని మంత్రి పొంగులేటి పేర్కొ న్నారు. సంబంధిత గ్రామాల ప్రజలు ఈ అవకా శాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి క్యాంపు కార్యాలయ ఇన్ చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి కోరారు.

# ఖచ్చితంగా వివరాలు నమోదు చేసుకోవాలి



ఖమ్మం,: జనగణన 2027లో భాగంగా సెల్ఫ్ ఎన్యుమరేషన్ కార్యక్రమంలో ఉప ముఖ్య ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పాల్గొన్నారు. సోమవారం ఉదయం ఖమ్మంలో ప్రజాభవన్ క్యాంప్ కార్యాలయంలో స్వీయ జనగణన కార్యక్రమంలో వెబ్ సైట్ ద్వారా ఆయన తన వివరాలను నమోదు చేసుకున్నాను. రాష్ట్రంలోని ప్రజలందరు జనగణనలో భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.ప్రజలంతా తమ వివరాలను స్వయంగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే విధానాన్ని ప్రోత్సహిస్తూ భట్టి విక్రమార్క స్వయంగా ఈ ప్రక్రియను పూర్తి చేశారు. ఈ విధానం ద్వారా జనగణనలో సమాచార సేకరణ సులభతరం అవుతుందని ఆయన పేర్కొన్నారు. తెలంగాణలో జనగణన 2027 ప్రక్రియలో భాగంగా, ప్రతి కుటుంబం తమ వివరాలను ఖచ్చితంగా నమోదు చేసుకోవాలని చెప్పారు. దీని ద్వారా ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు ప్రజలకు సరిగ్గా అందుతాయని ఉప ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకర, చీఫ్ ప్లానింగ్ అధికారి శ్రీనివాస్, టెక్నికల్ అసిస్టెంట్ హిమవర్ష తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ రాజకీయ ప్రత్యర్థి మాత్రమే..



హైదరాబాద్: మాజీ సీఎం కేసీఆర్ ఆరోగ్యంపై తాను ఎప్పుడూ నెగటివ్‌గా ఆలోచించలేదని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కేసీఆర్ తనకు రాజకీయ ప్రత్యర్థి మాత్రమేనని, శత్రువు కాదని అన్నారు. కేసీఆర్ ఆరోగ్యం గా ఉండటం తనకే మంచిదని, రాజకీయం గా ఎదుర్కోవడం సులభమవుతుందని వ్యాఖ్యానిం చారు. విశ్రాంతి తీసుకుంటున్న ప్రజా ప్రతినిధి గురించి చెడు కోరుకోవడం తన స్వభావం కాదని తెలిపారు. కేసీఆర్‌కు గాయమైనప్పుడు ఆస్పత్రికి వెళ్లి పరామర్శిం చానని, అసెంబ్లీకి వచ్చినప్పుడు కూడా ఆయన్ను కలిసి యోగక్షేమాలు అడిగానని రేవంత్ రెడ్డి తెలిపారు. రాజకీయంగా విభేదాలు ఉన్నప్పటికీ వ్యక్తిగతంగా గౌరవం ఉందని పేర్కొన్నారు. కేసీఆర్‌కు చెడు జరగాలని ఆయన కుటుంబ సభ్యులే కోరుకుం టున్నారని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. కేసీఆర్ బతికి ఉంటే తమకు అధికారం రాదని ఆయన కు టుంబ సభ్యు లే భావిస్తున్నారని వ్యాఖ్యానించారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడే కేటీఆర్ ముఖ్యమంత్రి కావాలని మంత్రులతో ప్రకటనలు చేయించారని ఆరోపించారు. అధికార పంపకాల విషయంలో తేడాలు రావడంతో కుటుంబంలో విభేదాలు వచ్చాయని అన్నారు. అయితే, వాళ్లంతా ఒక్కటేనని వ్యాఖ్యానించారు.

# గౌరవం తీసుకురావాలి- ఎమ్మెల్యే వేముల



చిట్యాల,: నేషనల్ హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైన రాష్ట్రానికి చెందిన విద్యార్థినులను ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అభినందించారు. సోమవారం నకిరేకల్ పట్టణంలోని క్యాంప్ కార్యాలయంలో నేషనల్ హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైన రాష్ట్రానికి చెందిన విద్యార్థినులను ఆయన ప్రత్యేకంగా కలుసుకుని, దేశ స్థాయిలో ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు క్రీడా జర్సీలను పంపిణీ చేశారు. క్రీడల్లో క్రమశిక్షణ, పట్టుదలతో ముందుకు సాగితే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని ఎమ్మెల్యే సూచించారు. జాతీయ స్థాయిలో మంచి ఫలితాలు సాధించి రాష్ట్రానికి గౌరవం తీసుకురావాలని కోరారు. విద్యార్థినుల ప్రతిభను అభినందిస్తూ, భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. క్రీడలకు ప్రభుత్వం పూర్తి మద్దతు ఇస్తుందని ఆయన హామీ ఇచ్చారు.

# అభివృద్ధి, శాంతి, ప్రగతికి అండగా ప్రజలు



కోల్‌కతా: పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో 'మా-మాటి-మానుష్' (తల్లి, నేల, ప్రజలు) విజయం ఖాయమని ముఖ్యమంత్రి, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ అన్నారు. బెంగాల్ సంస్కృతి, వారసత్వాన్ని రక్షించుకోవాలని, విభజన శక్తులను తిప్పికొట్టాలని ఓటర్లను కోరారు. 'మా-మాటి-మానుష్ ఇక అంచనాలకు సంబంధించిన విషయం కాదు, కాలమే సమాధానమిస్తుంది' అని అన్నారు.జరిపిన పాదయాత్రకు విశేషంగా స్పందించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. రెండో విడత ఎన్నికల ప్రచారానికి సోమవారం సాయంత్రం 6 గంటలకు తెరపడనుండటంతో సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ప్రజలను ఉద్దేశించి మమతాబెనర్జీ సుదీర్ఘ పోస్ట్ పెట్టారు.ఐకమత్యం, సంస్కృతి, నాగరికత బెంగాల్‌కు గర్వకారణమని, బెంగాల్ వారసత్వాన్ని దిగజార్చాలనుకునే విభజన, విధ్వంసకర శక్తులకు రాష్ట్రంలో చోటులేదని పరోక్షంగా బీజేపీని ప్రస్తావిస్తూ మమత బెనర్జీ ఘాటుగా విమర్శించారు. బీజేపీకి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి నలుదిశలకు విస్తరిస్తున్న తరుణంలో ఏ దుష్టశక్తీ దానిని అడ్డుకోలేదని పేర్కొన్నారు. ప్రజాసంక్షేమమే పరమావధిగా ప్రభుత్వం తీసుకుంటున్న సంక్షేమ చర్యలు బెంగాల్ ప్రజలకు రక్షణకవచమని, వీటిని అడ్డుకోవడం భూప్రపంచంలో ఎవరికీ సాధ్యం కాదని అన్నారు.రాష్ట్ర అభివృద్ధి, శాంతి, ప్రగతికి అండగా ప్రజలు నిలబడతారనే నమ్మకం తనకు ఉందని మమత బెనర్జీ ధీమా వ్యక్తం చేశారు. 'మన భాష, మన సంస్కృతి, గర్వించదగిన ఈ నేల వారసత్వాన్ని మనం పరిరక్షించుకోవాలి. కులం, మతం, భాష, నేపథ్యంతో సంబంధం లేకుండా ఈనెల 29న ప్రజలంతా జోరఫూల్ (రెండు పువ్వులు) గుర్తుకు ఓటు వేసి మా-మాటి-మనుష్ అభ్యర్థులకు అఖండ విజయం చేకూర్చాలి' అని మమత బెనర్జీ కోరారు.భవానీపూర్ నియోజకవర్గం నుంచి మమతా బెనర్జీ ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. ఈనెల 29న జరుగనున్న తుది విడత పోలింగ్‌లో భవానీపూర్ నియోజకవర్గం కూడా ఉంది. రెండు విడతలుగా నిర్వహిస్తున్న ఈ పోలింగ్‌లో తొలి విడత పోలింగ్ ఈనెల 23న జరిగింది. అనూహ్యంగా 93 శాతం పోలింగ్ నమోదైంది. అయితే భారీ పోలింగ్ తమకే అనుకూలమని, పోలింగ్ జరిగిన 152 నియోజకవర్గాల్లో 110 స్థానాలను తాము గెలుచుకోనున్నామని బీజేపీ ధీమా వ్యక్తం చేసింది. బీజేపీ వాదనను టీఎంసీ తోసిపుచ్చింది. వరుసగా నాలుగో సారి టీఎంసీ అధికారంలోకి రానుందని చెప్పింది. మే 4న అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి.

# తెలంగాణలో మరోసారి పెట్రోల్ కొరత!



హైద్రాబాద్: తెలంగాణ రాష్ట్రంలో మరోసారి పెట్రోల్, డీజిల్ కష్టాలు మొదలయ్యాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో పెట్రోల్, డీజిల్ కొరత ప్రజలను ఇబ్బంది పెడుతోంది. రాత్రి నుంచి పలు పెట్రోల్ బంకుల్లో నో స్టాక్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. పెట్రోల్, డీజిల్ కొరత వల్ల వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. స్టాక్ ఉన్న పెట్రోల్ బంకుల్లో పెద్ద సంఖ్యలో బారులు తీరారు. గంటల తరబడి వేచి ఉం డాల్సి వస్తోందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.నో స్టాక్ బోర్డుల దర్శనం : హైదరాబాద్‌లో కొన్నాళ్లుగా సీఎన్‌జీ కొరత కొనసాగుతోంది. సీఎన్‌జీ కోసం బంకుల ముం దు ఆటోలు బారులు తీరాయి. పలు జిల్లాల్లోనూ పెట్రోల్, డీజిల్ దొరకటం లేదని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాల్లోనూ పెట్రోల్ బంకుల్లో నోస్టాక్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. కొన్నిచోట్ల పెట్రోల్ లభ్యత ఉండగా, డీజిల్‌కు కొరత ఉంది.సమస్యను త్వరగా పరిష్కరించాలని వేడుకోలు : రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని పలు ప్రాంతాల్లో పెట్రోల్ కొరత ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోంది. రాత్రి నుంచి అనేక పెట్రోల్ బంకుల్లో ఇంధనం అందుబాటులో లేకపోవడంతో బంకులు మూసివేశారు. దీంతో ఉద్యోగులు, ఇతర పనుల కోసం బయటకు వెళ్లాల్సిన వారు అసౌకర్యాన్ని ఎదుర్కొంటున్నారు. మరికొన్ని పెట్రోల్ బంకుల్లో మాత్రమే ఇంధనం లభించడంతో ఆ బంకుల వద్ద వాహనదారులు బారులు తీరుతున్నారు. క్యూలో గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఇంధన సరఫరా సమస్యను త్వరగా పరిష్కరించాలని వాహనదారులు కోరుతున్నారు.మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా డీజిల్, పెట్రోల్ కొరతతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మహబూబా బాద్ పట్టణంలో 12 పెట్రోల్ బంక్‌లు ఉండగా ఉదయం నుంచి అన్ని బంక్ లలో నో స్టాక్ అనే బోర్డులు దర్శనమిస్తున్నాయి. దీంతో లారీలు, ట్రాక్టర్లు, రైతులు, వ్యాపారులు, క్రషర్ మిల్లులు, వరి కోత, మొక్క జొన్న నూర్పిడి యంత్రాల దారులు ఇబ్బందులు పడుతున్నారు. తమ వద్ద నిల్వ చేసుకున్న డీజిల్ అయిపోవడంతో వ్యవసాయ, ఆర్థిక కార్యకలాపాలు ఎక్కడికక్కడే ఆగిపోయాయని తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.అపోహలకు గురికావద్దు : తెలంగాణలో పెట్రోల్, డీజిల్, ఎల్ పీజీ గ్యాస్ సరఫరాకు నిల్వలు సమృద్ధిగా ఉన్నట్లు తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ అధికా రులుఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు ఎటు వంటి అపోహలకు గురికావద్దని సూచిం చారు. రోజుకి 9,574 కిలో లీటర్ల పెట్రోల్, 14,457 కిలో లీటర్ల డీజిల్ మొత్తం 24,000 కిలో లీటర్ల పైగా పెట్రోల్, డీజిల్ లను బంకుల ద్వా రా వాహనదారులకు అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే వినియోగదారులకు 2 లక్షల 22 వేలకు పైగా ఎల్ పీజీ గ్యాస్ సిలిండర్లు డెలివరీ చేస్తున్నట్లు తెలిపారు. పెట్రోల్, డీజిల్ సరఫరా, గ్యాస్ డెలివరీలపై పౌర సరఫరాల శాఖ టోల్ ఫ్రీ నెంబర్ 1967 ను సంప్రదిం చాలని కోరారు.

# అజారుద్దీన్, కోదండరాం ఎమ్మెల్సీగా ప్రమాణస్వీకారం



హైద్రాబాద్: గత కొన్ని నెలలుగా సాగుతున్న సస్పెన్స్ కు తెరపడింది. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా నియమించాలని రాష్ట్ర ప్రభుత్వం సిఫార్సు చేసిన అజారుద్దీన్, కోదండరాం పేర్లను గవర్నర్ శివ ప్రతా ప్ శుక్లా ఆమోదించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే వారిని ఎమ్మెల్సీలుగా నియమిస్తూ.. రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలోనే నేడు వారిద్దరూ ఎమ్మెల్సీలుగా ప్రమాణ స్వీకారం చేశారు. అజారుద్దీన్, కోదండరాంలతో.. తెలంగాణ శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి తాజాగా ప్రమాణ స్వీకారం చేయించారు. దీంతో గత కొన్ని రోజులుగా అజారుద్దీన్ మంత్రి పదవి ఉంటుందా పోతుందా అనే ఉత్కంఠకు తెరపడింది. మండలిలో జరిగిన ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితోపాటు పలువురు మంత్రులు కూడా హాజరయ్యారు. గవర్నర్ కోటాలో మహమ్మద్ అజారుద్దీన్, కోదండరాంలను ఎమ్మెల్సీలుగా నియమిస్తూ తెలంగాణ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేయగా.. గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఆదేశాలతో సాధారణ పరిపాలన శాఖ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది.ఎమ్మెల్సీగా తన పేరును ప్రతిపాదించినందుకు కాంగ్రెస్ పార్టీ హైకమాండ్‌కు, రాష్ట్ర మంత్రి మండలికి, పీసీసీకి అజారుద్దీన్ థ్యాంక్స్ చెప్పారు. రాష్ట్రంలో మైనార్టీల సంక్షేమానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యం ఇస్తోందని గుర్తు చేశారు. మైనార్టీల సంక్షేమం కోసం తాను మరింత కృషి చేస్తానని చెప్పారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ముస్లింల ఓట్ల కోసమే తనకు మంత్రి పదవి ఇచ్చారని అనడంలో ఎలాంటి నిజం లేదని.. ముందు నుంచీ సీఎం రేవంత్ రెడ్డి మైనార్టీలకు పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డిలకు అజారుద్దీన్ ప్రత్యేక ధన్యవాదాలు చెప్పారు. ఇక తనకు క్రికెట్ ఫ్యాన్స్ ఎక్కువ అని.. అందుకే పొలిటికల్ ఫ్యాన్స్‌ని పెంచుకుంటానని తెలిపారు. పదవులు అలంకారాలు కాదని కోదండరాం పేర్కొన్నారు. ప్రజల కోసం పని చేసేందుకే పదవులు అని వెల్లడించారు. ఎమ్మెల్సీ పదవి లేకముందు, వచ్చిన తర్వాత ఒకే రకంగా పనిచేస్తామని చెప్పారు. రిజర్వేషన్ల పెంపు, ఆదివాసీల భూ సమస్య, నిరుద్యోగ సమస్య, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి అంశాలపై పని చేస్తామని తెలిపారు. మంత్రి పదవిపై తనకు ఆశ లేదని స్పష్టం చేశారు. దివంగత ప్రొఫెసర్ జయశంకర్‌కు ఇచ్చిన మాట ప్రకారం తాను ముందుకు సాగుతానని తేల్చి చెప్పారు.

# 'ధాన్యం కొనుగోలు కేంద్రాలకు లారీలు పంపి ఎగుమతి చేయాలి'

నల్గొండ : రైతుల వద్ద నుండి ఎక్కువ తూకం తూసుకోవద్దని, ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వెంట వెంటనే లారీలు పంపించి ఎగుమతులు త్వరితగతిన చేయాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సిపిఎం ఆధ్వర్యంలో నల్లగొండ పట్టణంలోని 11వ డివిజన్ మామిళ్ళగూడెంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి రైతులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 40 కేజీల 650 గ్రాములు తూకం వేయాల్సి ఉండగా 42 కేజీలు తూకం వేయడంతో పాటు రైస్ మిల్లులకు వెళ్లిన తర్వాత మరో కేజీ కటింగ్ చేస్తున్నారన్నారు. ఆరుగాలం శ్రమించి రైతు ధాన్యం కొనుగోలు కేంద్రానికి వడ్లు తీసుకొచ్చి అమ్ముకోవడానికి అవస్థలు పడడం బాధాకరం అన్నారు.సకాలంలో లారీలు పంపించి కాంట వేసిన వడ్లను వెంటనే ఎగుమతి అయ్యే విధంగా అధికారులు చూడాలని కోరారు. ధాన్యం కొనుగోలు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని రైతులను అన్యాయం చేయాలని చూస్తే ఊరుకునేది లేదని రైతులతో కలిసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు .ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సయ్యద హాశం, పట్టణ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య, మం డల కార్యదర్శి నలపరాజు సైదులు, పట్టణ కమిటీ సభ్యు లు దండెంపల్లి సరోజ, 11వ డివిజన్ శాఖ కార్యదర్శి పనస చంద్రయ్య, వార్డు పెద్దలు, రైతులు పాల కూరి సంతోష్, పజ్జూరి శేఖర్, దండంపల్లి యాదయ్య, మారయ్య, పనస దేవేందర్, అలుగుబెల్లి రమణారెడ్డి, మెట్టు యాదయ్య,అనిల్ పాల్గొన్నారు.

# దేశ టైమ్స్

## సంపాదకీయం

### ప్రపంచంలో ఏ ప్రాంతమైనా ప్రగతిపథంలో సాగాలంటే పెట్టుబడులు ఆకర్షించాలి...

పోరాడి సాధించుకున్న తెలంగాణ ప్రజల ఆకాంక్షలు నెరవేరాలంటే ఆర్థికంగా బలపడాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చేపడతున్న చర్యలు ఫలితాలిస్తున్నాయి. ఆర్థికంగా స్వాలంబన చేకూరాలంటే రాష్ట్రంలో భారీగా పెట్టుబడులు ఆకర్షించి పరిశ్రమలు తెచ్చేందుకు కంకణం కట్టుకున్న ప్రభుత్వం ఆ దిశగా విజయవంతమయినట్టు గణాంకాలు నిరూపిస్తున్నాయి. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడంతోపాటు ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న ప్రభుత్వం అదే సమయంలో తెలంగాణ భవిష్యత్ లక్ష్యాలను నిర్దేశించుకుంది. 'తెలంగాణ రైజింగ్-2047' లక్ష్యంగా దేశానికి స్వాతంత్ర్యం వచ్చి వందేళ్లు పూర్తవుతున్న శుభ సందర్భంగా 2047 నాటికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను మూడు ట్రిలియన్ డాలర్లకు చేర్చేలా దశా దిశ నిర్దేశించుకొని దేశానికి ఆదర్శంగా నిలిచింది. రాష్ట్రంలో పెట్టుబడుల కోసం దావోస్‌తో పాటు ఇతర వేదికలపై ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందాలు కార్యరూపం దాలుస్తున్నాయి. ప్రపంచంలో ఏ ప్రాంతమైనా ప్రగతిపథంలో సాగాలంటే పెట్టుబడులు ఆకర్షించాలి.భారీ పెట్టుబడులను ఆకర్షించాలని కంకణం కట్టుకున్న తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలోని వనరులను సద్వినియోగం చేసుకోవడంతోపాటు పెట్టుబడుదారులకు రాష్ట్రంలో అనుకూల వాతావరణం కల్పించడంతో ఐటి రంగానికి తెలంగాణ కేరాఫ్‌గా మారింది. ప్రభుత్వం ప్రకటనలకే పరిమితం కాకుండా ఆచరణలో తీసుకుంటున్న చర్యలతో రాష్ట్రం పెట్టుబడిదారులకు గొప్ప వరంగా మారింది. 'తెలంగాణ రైజింగ్-2047'కు అనుగుణంగా ప్రభుత్వం వందేళ్లకు అవసరమైన ప్రణాళికలు రూపొందిస్తుండడంతో రాష్ట్రం భారీ పెట్టుబడులకు సోపానంగా మారుతోంది. రేవంత్‌రెడ్డి తెలంగాణ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక ఆయన మార్గదర్శకంలో ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు నేతృత్వంలో తెలంగాణ బృందం చేసిన విశేష కృషితో దావోస్ వేదికగా జరిగిన 2024, 2025, 2026 వాణిజ్య సమావేశాల్లో, 2025 డిసెంబర్‌లో హైదరాబాద్‌లో జరిగిన తెలంగాణ గ్లోబల్ సమిట్‌లో కూడా రాష్ట్రానికి భారీగా పెట్టుబడులొచ్చాయి.రాష్ట్రంలో పెట్టుబడులపై పరిశ్రమల శాఖ ప్రభుత్వానికి ఇచ్చిన నివేదిక ఎంతో ఆశాజనకంగా ఉంది. దావోస్ వేదికగా ప్రపంచ ఆర్థిక సదస్సులో 2024, 2025 సంవత్సరాల్లో 42 కంపెనీలతో రూ. 2,19,182 కోట్ల విలువైన ఒప్పందాలు కుదుర్చుకోగా వాటిలో రూ. 85,200 కోట్లు అంటే 39 శాతం పెట్టుబడులు కార్యరూపం దాల్చడం ప్రభుత్వం చేస్తున్న కృషికి నిదర్శంగా నిలిచాయి. 2024లో ఎంఒయు కుదుర్చుకున్న 10 కంపెనీలు, 2025లో ఒప్పందం కుదుర్చుకున్న 10 కంపెనీలు రాష్ట్రంలో పనులు ప్రారంభించాయి. ఇందులో ప్రధానంగా ఐటి, పరిశ్రమల రంగాలకు చెందిన గ్లోబల్ కేపబులిటీ సెంటర్లు, డేటా సెంటర్ ప్రాజెక్టులున్నాయి. వరల్డ్ ఎకనామిక్ ఫోరం 2024, 2025 లో వచ్చిన పెట్టుబడులకు సంబంధించిన వాటా 34 శాతం ఉండగా, వీటిలో ప్రధానంగా పంప్ స్టోరేజ్ ప్రాజెక్టులు, పునరుత్పాదక ఇంధన ప్లాట్లు ఉన్నాయి.తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్ 2025లో కుదిరిన మొత్తం 75 ఒప్పందాలపై ప్రభుత్వం వేగవంతంగా చర్యలు తీసుకోవడంతో 14 ఒప్పందాలు అమల్లోకి వచ్చాయి. రూ. 30 వేల కోట్ల పెట్టుబడులు కార్యరూపం దాల్చడానికి అవసరమైన 255పైగా ఎకరాల భూమిని ప్రభుత్వం కంపెనీలకు కేటాయించింది. దావోస్ 2026 సమిట్‌లో కుదిరిన ఒప్పందాలు కూడా వాస్తవ రూపం దాలుస్తున్నాయి. ఈ సమిట్‌లో కుదిరిన 75 ఒప్పందాల్లో 16 ప్రాజెక్టులు భారత్ ఫ్యూచర్ సిటీలో పెట్టేందుకు ఆసక్తి చూపిస్తున్నాయి.ఎంటర్‌టైన్‌మెంట్ జోన్, హెల్త్, మెడికల్ టూరిజం జోన్, ఎఐ సిటి, ఎడ్యుకేషన్ జోన్, ఇవి తయారీ జోన్‌లు ఈ ప్రాజెక్టులో ఉన్నాయి. 2024 నుండి 2026 వరకు తెలంగాణకు సుమారు రూ. 8 లక్షల కోట్ల పెట్టుబడుల ఎంఒయు లొచ్చాయి. వీటిలో వాటిలో దాదాపు 35 నుండి 40 శాతం పనులు ప్రారంభమయ్యాయి. తెలంగాణలో పెట్టుబడులను ప్రోత్సాహించేందుకు ప్రభుత్వం పారిశ్రామిక విధానం రూపొందించడంతో కంపెనీలకు రాష్ట్రం అనుకూలంగా మారింది. పరిశ్రమల ఏర్పాటుకు వచ్చే దరఖాస్తులపై కాలయాపన చేయకుండా సింగిల్ విండో విధానంలో 15 రోజుల్లో అనుమతులు మంజూరు చేస్తోంది.రాష్ట్రంలో పరిశ్రమల పెట్టుబడులతో ఆర్థికాభివృద్ధే కాకుండా, ఉపాధి అవకాశాలతోపాటు రియల్ ఎస్టేట్ కూడా వేగంగా పుంజుకుంటోంది. యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు పెంచాలనే దృఢ సంకల్పంతో ప్రభుత్వం పరిశ్రమల ఏర్పాటుకు సానుకూల చర్యలు చేపట్టింది. సాంకేతిక పెట్టుబడులకు కీలకంగా మారిన గ్రేటర్ హైదరాబాద్‌కు ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీలు క్యూ కట్టాయి. బెంగళూరు, పుణె, గుర్‌గావ్ నగరాలను వెనక్కునెట్టి హైదరాబాద్ 'గ్లోబల్ ఐటీ హబ్'గా రూపొంది ప్రముఖ టెక్ సంస్థలకు వేదికైంది. రాష్ట్రానికి వస్తున్న పెట్టుబడుల్లో సాఫ్ట్‌వేర్ రంగానిదే కీలకం కావడంతో ప్రభుత్వం దీనికి అనుగుణంగా పలు విప్లవాత్మక నిర్ణయాలతో ముందుకొస్తుండడంతో యువతకు అవకాశాలు మెరుగయ్యాయి. నగరంలో 1500కుపైగా ఐటి కంపెనీలుండగా, ఇక్కడ 10 లక్షల మందికిపైగా ఉపాధి పొందుతున్నారు. ప్రపంచంలో అత్యుత్తమ 10 ఐటి కంపెనీల్లో 7 గ్రేటర్ నగరంలో ఉన్నాయి. మైక్రోసాఫ్ట్, అమెజాన్, మెటా, గూగుల్, సేల్స్ ఫోర్సు కంపెనీలకు నగరంలో కార్యాలయాలున్నాయి. ప్రపంచంలో మెరుగైన నగరాలతో పోటీపడేలా హైదరాబాద్ శివార్లలో ఫ్యూచర్ సిటీ, యంగ్ ఇండియా యూనివర్సిటీ ఏర్పాటుతో తెలంగాణలో పెట్టుబడులకు అదనపు బలం చేకూరింది. బలమైన ఆర్థిక పునాదులుంటేనే రాష్ట్రం అభివృ ద్ధిలో కొనసాగుతుందనే దూరదృష్టితో చర్యలు తీసుకున్న ప్రభుత్వం అందులో భాగంగా పెట్టుబడులను ఆకర్షించడానికి ఏర్పాటు చేసిన ఫ్యూచర్ సిటీ కంపెనీలకు వరంగా మారింది. తెలంగాణతో ఒప్పందాలు కుదుర్చుకున్న పలు కంపెనీలు ఫ్యూచర్ సిటిలో ప్రభుత్వం కల్పించిన మౌలిక సదుపాయాలకు ఆకర్షితులై పెట్టుబడులు పెట్టడానికి ముందుకొచ్చాయి. సకల సౌకర్యాలతో 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీని ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తున్నారు. హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్‌లకు అదనంగా నాలుగో నగరంగా 'ఫ్యూచర్ సిటీ' రూపొందుతోంది.ఇక్కడ ఐటితో పాటు ఇతర రంగాలకు కూడా ప్రాధాన్యతిస్తున్నారు. యాపిల్ ఫోన్ విడిభాగాల పరిశ్రమ, ఎలక్ట్రిక్ ఇవి బస్సుల తయారీ యూనిట్, టెక్స్‌టైల్ పరిశ్రమలు, ప్రతిష్టాత్మకమైన విద్యా సంస్థలు, రెస్టారెంట్లు, రేస్ క్లబ్, గోల్ఫ్ క్లబ్, ట్రేడ్ సెంటర్లు రానున్నాయి. కాలుష్య రహితంగా అభివృద్ధి చేస్తున్న ఈ ఫోర్త్ సిటీలో పరిశోధనలు చేసే సంస్థలకు, ముడి సరుకు తెచ్చి మందులను తయారు చేసే ఫార్మా కంపెనీలకే భూములను కేటాయిస్తారు. శంషాబాద్ విమానాశ్రయం సమీపంలో ఉండడంతోపాటు రహదారుల విస్తరణ, మెట్రో పొడగింపుతో నాలుగో నగరానికి రవాణా సదుపాయాలు పుష్కలంగా ఉన్నాయి. అంతర్జాతీయ ప్రమాణాలతో ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ఎఐ యూనివర్సిటీ పలువురిని ఆకర్షిస్తోంది. యువతను ఎఐ నిపుణులుగా తీర్చిదిద్దాలనే గొప్ప లక్ష్యంతో 'తెలంగాణ డేటా ఎక్స్‌ఛేంజ్' (టిజిడెక్స్)ను ఏర్పాటు చేసిన తొలి రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది. కాలానుగుణంగా ప్రభుత్వం చేపడుతున్న చర్యలు రాష్ట్రంలో పెట్టుబడులకు కీలకంగా మారాయి. పెట్టుబడులను ఆకర్షించడంలో తెలంగాణ ప్రభుత్వం ప్రణాళికాబద్ధమైన విధానాలతో వేగవంతమైన నిర్ణయాలు, పారదర్శక పరిపాలనతో గణనీయమైన పురోగతి సాధిస్తోంది. పలు వేదికలపై కుదిరిన ఒప్పందాలు కార్యరూపం దాల్చడం రాష్ట్రంపై పెట్టుబడిదారుల విశ్వాసాన్ని ప్రతిబింబిస్తోంది. ఉపాధి అవకాశాలు, సదుపాయాల అభివృద్ధి, సాంకేతిక రంగంలో పురోగతి రాష్ట్రాన్ని సమగ్రాభివృద్ధి దిశగా తీసుకెళ్తున్నాయి. ఇదే నిబద్ధతతో కొనసాగితే 'తెలంగాణ రైజింగ్- 2047' కేవలం విజన్‌గానే కాకుండా వాస్తవాల దృక్పథంతో తెలంగాణ ఆదర్శంగా నిలుస్తుంది.

## రెడ్ క్రాస్ సొసైటీ చలివేంద్రం ప్రారంభం

వరంగల్: వరంగల్‌జిల్లా కలెక్టర్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షురాలు చాహత్ బాజ్ పాయ్ ఆదేశాలమేరకు, హనుమకొండ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ మండుటెండల్లో ప్రజలకు తాగునీరు అందించాలనే ఉదాత్త లక్ష్యంతో, హనుమకొండ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రెడ్ క్రాస్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్, రెడ్ క్రాస్ సొసైటీ ఉపాధ్యక్షులు యన్.రవి ప్రారంభిం చారు.అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మండుటెండల్లో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చేపట్టిన ఈచలివేంద్రం సేవా దృక్పథానికి ప్రతిరూపం. నా పరిమితుల్లో ఉన్న సహాయం రెడ్ క్రాస్ కు అందించేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. తలసీమియా బాధితుల కోసం రెడ్ క్రాస్ అందిస్తున్న సేవలను ప్రశంసిస్తూ, పాలకవర్గానికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ పాలకవర్గ సభ్యులు మాట్లాడుతూ పట్టణంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు, ఎండలో కష్టపడే కూలీలు, వ్యాపారాలు, పనుల నిమిత్తం బయటకు వచ్చే సందర్భంలో తాగునీటి కొరత ఎదుర్కొనకుండా ఉండేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేశాం అని తెలిపారు.అనంతరం అదనపు కలెక్టర్ యన్.రవి ని రెడ్ క్రాస్ సభ్యులు శాలువాతో సత్కరించి షీల్ అందచేశారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ పి.విజయ్ చందర్ రెడ్డి, కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి, రాష్ట్ర మేనేజింగ్ కమిటీ సభ్యులు ఈ. వి. శ్రీనివాస్ రావు, జిల్లా పాలకవర్గ సభ్యులు పుల్లూరి వేణుగోపాల్, పొట్లపల్లి శ్రీనివాస్ రావు, బిళ్ళ రమణ రెడ్డి, రెడ్ క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రపంచ ఆయుధ దిగుమతుల్లో భారత్ 'సెకండ్'..

న్యూఢిల్లీ: రక్షణ రంగంలో 'ఆత్మనిర్భర్ భారత్' నినాదంతో మనం స్వదేశీ తయారీకి ఎంత ప్రాధాన్యత ఇస్తున్నప్పటికీ, స్టాక్‌హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎస్ఐపీఆర్ఐ) వెల్లడించిన గణాంకాలు చేదు నిజాన్ని వెల్లడిస్తున్నాయి. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం కారణంగా యుద్ధ సామగ్రి దిగుమతుల్లో ఉక్రెయిన్ అగ్రస్థానంలో ఉండగా, శాంతి సమయాల్లోనూ భారత్ ప్రపంచంలోనే రెండో అతిపెద్ద ఆయుధ దిగుమతిదారుగా నిలవడం గమనార్హం. అంతర్జాతీయ ఆయుధ మార్కెట్లో భారతదేశం తన ఉనికిని చాటుతోంది. సిప్రి నివేదిక ప్రకారం.. ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న మొత్తం ఆయుధ దిగుమతుల్లో భారత్ వాటా 8.2 శాతంగా ఉంది. 9.7 శాతంతో ఉక్రెయిన్ మొదటి స్థానంలో ఉంది. అయితే, ఉక్రెయిన్ ప్రస్తుతం తీవ్రమైన యుద్ధంలో ఉంది కాబట్టి ఆ స్థాయిలో దిగుమతులు చేసుకోవడం సహజం. కానీ, భారత్ ఎటువంటి ప్రత్యక్ష యుద్ధంలో లేనప్పటికీ సౌదీ అరేబియా (6.8%), ఖతార్ (6.4%) వంటి సంపన్న అరబ్ దేశాలను మించి ఆయుధాలను కొనుగోలు చేస్తోంది. పాకిస్తాన్ (4.2%), జపాన్ (3.9%) వంటి దేశాలు మనకంటే వెనుకబడి ఉన్నాయి.ందుకీ భారీ దిగుమతులు? భారత్ తన రక్షణ వ్యవస్థను ఆధునీకరించుకునేందుకు భారీగా ఖర్చు చేస్తోంది. చైనా, పాకిస్తాన్ వంటి పొరుగు దేశాలతో ఉన్న ఉద్రిక్తతల దృష్ట్యా భారత సైన్యం ఎప్పుడూ సిద్ధంగా ఉండాలి. ముఖ్యంగా అత్యాధునిక యుద్ధ విమానాలు, క్షిపణి రక్షణ వ్యవస్థలు, జలాంతర్గాముల కోసం మనం ఇతర దేశాలపై ఆధారపడాల్సి వస్తోంది. భారత సాయుధ దళాల వద్ద ఉన్న పాత తరం సోవియట్ కాలపు ఆయుధాలను మార్చి, వాటి స్థానంలో అత్యాధునిక టెక్నాలజీని తీసుకు రావడమే దిగుమతులకు ప్రధాన కారణం.ప్రధాన సరఫరాదారులు ఎవరు..? భారత్‌కు ఆయుధాలను సరఫరా చేస్తున్న దేశాల్లో రష్యా ఇప్పటికీ అగ్రస్థానంలో ఉంది. ఉక్రెయిన్ యుద్ధం తర్వాత రష్యాపై ఆధారపడటం తగ్గించిన భారత్ ఫ్రాన్స్, అమెరికా, ఇజ్రాయెల్ వైపు మొగ్గు చూపుతోంది. ఫ్రాన్స్ నుంచి వచ్చిన 'రాఫెల్' విమానాలు, అమెరికా నుంచి వస్తున్న ఎంక్యూ-9బీ (పీ-9డీ) డ్రోన్లు ఈ దిగుమతుల్లో సింహభాగాన్ని ఆక్రమిస్తున్నాయి. ఆత్మనిర్భరత ఎటువైపు..? కేంద్రం రక్షణ రంగంలో దిగుమతులను తగ్గించి, ఎగుమతులను పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది. బ్రహ్మోస్ క్షిపణులు, తేజస్ విమానాల ద్వారా భారత్ ఇప్పుడు ఆయుధాలను విదేశాలకు అమ్ముతోంది. టాటా, అదానీ, ఎల్అండ్‌టీ వంటి సంస్థలు రక్షణ ఉత్పత్తుల తయారీలో కీలకంగా మారాయి. అయినప్పటికీ, ఇంజిన్ తయారీ, అత్యాధునిక రాడార్ టెక్నాలజీ వంటి కీలక విభాగాల్లో మనం కొంత వెనుకబడే ఉన్నామని చెప్పక తప్పడం లేదు. ఆయుధ దిగుమతుల్లో రెండో స్థానంలో ఉండడం మన రక్షణ వ్యవస్థ పటిష్టతను సూచిస్తున్నప్పటికీ, ఆర్థికంగా భారీ భారం. ఆయుధాల కోసం వేల కోట్లు విదేశాలకు చెల్లించడం కంటే, ఆ సొమ్మును స్వదేశీ పరిశోధనకు వెచ్చిస్తే భవిష్యత్తులో మనం దిగుమతిదారు నుంచి ఎగుమతిదారుగా మారే అవకాశం ఉంది. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా ఉన్న భారత్, ఆయుధాల కోసం మరొక దేశంపై ఆధారపడకుండా ఉన్నప్పుడే నిజమైన రక్షణ శక్తిగా అవతరిస్తుంది.

## వేసవిలో రక్తం నిల్వల కొరత..

హైద్రాబాద్: రక్తదానం చేయడం గొప్ప దానంగా పరిగణిస్తారు. ఒకరు రక్తదానం చేయడం వల్ల ముగ్గురి ప్రాణాన్ని కాపాడొచ్చు. అందుకే రక్తదానం చేసే వారిని ప్రాణదాతలుగా పేర్కొంటారు. అయితే, గ్రేటర్ హైదరాబాద్‌లో రక్తం నిల్వలు పడిపోయాయి. రక్తం అవసరమయ్యే వారి సంఖ్య పెరుగుతుండగా.. ఇందుకు అనుగుణంగా రక్త సేకరణ లేకపోవడంతో రక్తం నిల్వలు తగ్గుతున్నాయి. దీంతో తలసేమియా బాధితులకు ఇబ్బందులు తప్పడం లేదు.మార్చి నుంచి రక్తదానం చేసే వారి సంఖ్య క్రమంగా తగ్గుతూ వస్తోంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ప్రభుత్వ, ప్రయివేటు కలిపి దాదాపు 85 వరకు బ్లడ్ బ్యాంకులున్నాయి. ఎన్జీవోలకు సంబంధించి 38 వరకు ఉన్నాయి. ప్రతి ఏడాదీ గ్రేటర్ హైదరాబాద్‌లో దాదావు 4 లక్షల యూనిట్ల వరకు రక్తం అవసరం ఉంటుంది. ప్రస్తుతం కొరత ఏర్పడటంతో బ్లడ్ బ్యాంకుల్లో రక్తం నిల్వలు పడిపోయాయి. నగరంలో తలసేమియా బాధితులతో కలుపుకుని ఇతర రోగులకు రోజుకు 7-10 వేల యూనిట్ల రక్తం అవసరం ఉండగా.. ప్రస్తుతం సకాలంలో రక్తం అందించలేని పరిస్థితి ఏర్పడింది.వేసవిలో అధిక కొరతప్రతి వేసవిలోనూ బ్లడ్ బ్యాంకుల్లో రక్తం నిల్వలు పడిపోవడం సర్వసాధారమే. కానీ ఈ ఏడాది కొరత తీవ్రంగా ఉందని నిర్వాహకులు చెబుతున్నారు. ప్రస్తుతం వేసవి నేపథ్యంలో గ్రేటర్ హైదరాబాద్‌లోని ప్రభుత్వ, ప్రయివేటు, ఎన్జీవోల బ్లడ్ బ్యాంకుల్లో చాలా వరకు రక్తం నిల్వలు తగ్గిపోయాయి. నారాయణగూడలోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ (ఐపీఎం)లో సాధారణ రోజుల్లో 100-150 యూనిట్ల వరకు సరఫరా చేస్తుంటారు. ఇక్కడి నుంచి నిత్యం నిలోఫర్, ఉస్మానియా, పేట్లబుర్జు ప్రసూతి ఆస్పత్రులకు పంపుతుంటారు. ప్రస్తుతం రక్తం కొరతతో వీటికి కూడా అత్యవసరమైతే తప్ప బల్క్‌గా సరఫరా చేయడం లేదు. వైద్య శిబిరాల ద్వారా సేకరించిన రక్తం యూనిట్లలో 30 శాతం ప్రభుత్వ బ్లడ్ బ్యాంకులకు సరఫరా చేస్తుంటారు. ప్రస్తుతం వేసవి తరుణంలో శిబిరాలు తగ్గడంతో సేకరణ తగ్గింది. ముఖ్యంగా నెగెటివ్ గ్రూపు బ్లడ్ కొరత ఎక్కువగా ఉంది.వేసవిలో తగ్గిన వైద్య శిబిరాలువేసవిలో కాలేజీలకు సెలవుల వల్ల రక్తదాన శిబిరాలు తక్కువయ్యాయి. దీనికితోడు ఎండా కాలంలో రక్తదానం చేస్తే అనారోగ్యాల బారిన పడతామనే భావనతో చాలా మంది దాతలు ముందుకు రావడం లేదు. ఈ పరిస్థితులన్నీ బ్లడ్ బ్యాంకుల్లో నిల్వలు తగ్గడానికి కారణమని వైద్యులు చెబుతున్నారు. ఆరోగ్యంగా ఉన్న వ్యక్తి మూడు నెలల వ్యవధితో ఏడాదిలో గరిష్టంగా నాలుగు సార్లు రక్తదానం చేయొచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు. స్వచ్ఛంద సంస్థలు, పోలీసులు, విద్యాసంస్థలు, యువజన సంఘాల సహకారంతో రక్తదాన శిబిరాలు నిర్వహిస్తూ రక్తాన్ని సేకరించి బ్లడ్ బ్యాంకుల్లో నిల్వ చేస్తారు. ప్రస్తుతం రక్తం కొరతతో కొంత మందికి అందించలేని పరిస్థితి ఉందని నిర్వాహకులు చెబుతున్నారు. అత్యవసర సమయంలో తమ వద్ద ఉన్న రక్తదాతల జాబితా నుంచి అవసరమైన గ్రూపు వారికి సమాచారం ఇచ్చి రక్తం సేకరించాల్సి వస్తుందంటున్నారు.తలసేమియా బాధితులకు తప్పని తిప్పలుతలసేమియా వ్యాధి బారినపడిన వారికి 20 రోజులకోసారి రక్తం ఎక్కించాల్సి ఉంటుంది. సకాలంలో రక్తం అందకపోతే ప్రాణం పోయే ప్రమాదం ఉంటుంది. ఇలాంటి వారికి దాతల నుంచి సేకరించిన రక్తం చాలా ఉపయోగపడుతుంది. ఈ తలసేమియా బాధితులకు దాదాపు నిత్యం 4 వేల యూనిట్ల రక్తం అవసరం అవుతుంది. ఇందులో తలసేమియా, సికిల్ సెల్ ఎనీమియా సొసైటీ తరపున 50 శాతం, ప్రభుత్వ రక్త నిధుల నుంచి 50 శాతం సరఫరా చేస్తుంటారు. ప్రస్తుతం సరఫరా తగ్గడంతో బాధితులకు ఇబ్బందులు తప్పడం లేదు. రక్తాన్ని వివిధ రకాలుగా విడగొట్టి భద్రపరుస్తుంటారు. ఇందులో ఎర్ర రక్తకణాలు యథాస్థితిగా 35-45 రోజులు, ప్లాస్మా గడ్డ కట్టిస్తే ఏడాది, ప్లేట్లెట్లు 5 రోజుల వరకు నిల్వ ఉంటాయి. ఇలా రక్తం ఎక్కువ కాలం నిల్వ ఉండే పరిస్థితి ఎక్కువ కేంద్రాల్లో లేకపోవడం వల్ల ఎప్పటికప్పుడూ క్యాంపులు నిర్వహించి బ్లండ్ బ్యాంకులకు తరలించాలి. ఈ నేపథ్యంలో రక్తం అవసరమయ్యే వారికి ఆరోగ్యవంతులు దానం చేయొచ్చునని నిపుణులు చెబుతున్నారు.

## త్వరలో కొత్త బిల్డింగ్ రూల్స్..

హైద్రాబాద్: తెలంగాణలో భవన నిర్మాణ అనుమతుల ప్రక్రియను మరింత సులభతరం చేసేందుకు ప్రభుత్వం 'ఏకీకృత భవన నియమావళి'ని తీసుకువస్తోంది. హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కసరత్తు మరో 3 నుంచి 5 నెలల్లో పూర్తి కానుంది. ఢిల్లీ, ముంబై వంటి నగరాల నిబంధనలను అధ్యయనం చేసి.. ఎఫ్ఎస్ఐ, ఎఫ్ఏఆర్ వంటి అంతర్జాతీయ ప్రమాణాలను మన వద్ద ప్రవేశపెట్టనున్నారు. ముఖ్యంగా ఒకే భవనంలో నివాస, వాణిజ్య కార్యకలాపాలకు అనుమతినిచ్చే వర్టికల్ మిక్స్ విధానం ఈ కొత్త కోడ్‌లో ప్రధాన ఆకర్షణ కానుంది.భవన నిర్మాణ రంగం సరికొత్త మలుపు తిరగబోతోంది. ప్రస్తుతం ఉన్న భవన నిర్మాణ నిబంధనలను హేతుబద్ధీకరించి, సరళీకృతం చేసే ఉద్దేశంతో తెలంగాణ ప్రభుత్వం ఏకీకృత భవన నియమావళికి రూపకల్పన చేస్తోంది. ఇందుకోసం హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ (ఎవీణూ) ఇప్పటికే కసరత్తు ప్రారంభించింది. రాబోయే 3 నుంచి 5 నెలల్లో ఈ కొత్త నిబంధనలను అమలులోకి తీసుకురావాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ కొత్త కోడ్ తయారీ కోసం అధికారులు ఢిల్లీ, ముంబై, చండీగఢ్, నయా రాయ్‌పూర్ వంటి భారతీయ నగరాలతో పాటు పలు అంతర్జాతీయ నగరాల్లో అమల్లో ఉన్న నిబంధనలను లోతుగా అధ్యయనం చేశారు.ప్రస్తుతం హెచ్ఎండీఏ, డీటీసీపీ పరిధిలో భవన నిర్మాణ అనుమతుల విధానం వేర్వేరుగా ఉంది. కొత్త నిబంధనల ప్రకారం.. ఈ రెండు విభాగాల అనుమతుల విధానాన్ని ఏకీకృతం చేయనున్నారు. అంటే రాష్ట్రవ్యాప్తంగా లేఅవుట్లు, ఓపెన్ స్పేస్, సెట్‌బ్యాక్, అంతర్గత రోడ్లు, పార్కింగ్ వంటి మౌలిక వసతుల కల్పనలో ఒకే రకమైన ప్రామాణిక విధానం అమల్లోకి వస్తుంది. ముంబైలో అమల్లో ఉన్న ఫ్లోర్ స్పేస్ ఇండెక్స్, ఢిల్లీలో ఉన్న ఫ్లోర్ ఏరియా రేషియో వంటి పద్ధతులను ఇక్కడ కూడా ప్రవేశపెట్టేలా ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. దీనివల్ల బిల్డర్లకు, సామాన్య ప్రజలకు నిర్మాణ వ్యయంపై ముందస్తు అంచనా రావడమే కాకుండా పారదర్శకత పెరుగుతుంది.ఈ కొత్త నియమావళిలో అత్యంత కీలకమైన అంశం వర్టికల్ మిక్స్ విధానం. ప్రస్తుతం బహుళ అంతస్తుల వాణిజ్య భవనాల్లో కేవలం వ్యాపార కార్యకలాపాలకు మాత్రమే అనుమతి ఉంది. దీనివల్ల గ్రౌండ్, ఫస్ట్ ఫ్లోర్ మినహా మిగతా అంతస్తులకు పెద్దగా డిమాండ్ ఉండటం లేదు. కానీ వర్టికల్ మిక్స్ విధానం అమల్లోకి వస్తే.. ఒకే భవనంలో కింది అంతస్తుల్లో వాణిజ్య సంస్థలు, పై అంతస్తుల్లో నివాస గృహాలు లేదా కార్యాలయాలకు అనుమతిస్తారు. దీనివల్ల భూమి వినియోగం పెరగడమే కాకుండా, నగరాల్లో ట్రాఫిక్ సమస్యలు తగ్గే అవకాశం ఉంది. నివాసం, పని ప్రదేశం ఒకే చోట ఉండటం వల్ల వాక్-టు -వర్క్ సంస్కృతి బలపడుతుంది. అంతే కాకుండా.. గ్రౌండ్ కవరేజ్‌పై కూడా స్పష్టమైన ఆంక్షలు, సరళీకరణలు ఉండనున్నాయి. 10 అంతస్తుల పైబడిన భవనాలకు హెచ్ఎండీఏ అనుమతులు, అంతకంటే తక్కువ ఉన్న వాటికి కార్పొరేషన్ల ద్వారా ఇచ్చే విధానంలో కూడా మరింత స్పష్టత తీసుకురానున్నారు. ఈ ఏకీకృత నియమావళి అమల్లోకి వస్తే.. నిర్మాణ రంగంలో పెట్టుబడులు పెరగడంతో పాటు హైదరాబాద్ వంటి నగరాల రూపురేఖలు మరింత ఆధునికంగా మారతాయని నిపుణులు అంచనా వేస్తున్నారు.

## కేసీఆర్ 70 లక్షల మంది రైతులకు కరోనా లాంటి క్లిష్ట సమయాల్లో కూడా..

## రైతుబంధు అందించారు: కేటీఆర్



యాదాద్రి భువనగిరి : 60 ఏండ్లు పాలించిన ఈ కాంగ్రెస్ సన్నాసులు నల్గొండకు కనీసం నీళ్లు కూడా ఇవ్వలేదు. కానీ కేసీఆర్ పదేళ్లలో నల్గొండలోని చివరి మడివరకు నీళ్లు పారేలా కృషి చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. హుజూర్‌నగర్ నియోజకవర్గానికి చెందిన ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ యువ నాయకుడు పిల్లుట్ల రఘు బీఆర్ఎస్‌లో చేరారు. తెలంగాణ భవన్‌లో పిల్లుట్ల రఘుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేటీ ఆర్ మాట్లాడుతూ.. అవును కేసీఆర్ అప్పుడుచేసిండు.. కేసీఆర్ అప్పు ఎందుకు చేసిండంటే 70 లక్షల మంది రైతుల ఖాతాల్లో 73 వేల కోట్లు వేయడానికి అప్పు చేసిండు. కేసీఆర్ 70 లక్షల మంది రైతులకు కరోనా లాంటి క్లిష్ట సమయాల్లో కూడా రైతుబంధు అందించారు. వెయ్యి గురుకుల పాఠశాలలు పెట్టి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ పిల్లలకు 6.50 లక్షల మంది చిన్నారులకు విద్యాబుద్ధులు చెప్పించే దానికి అప్పుడు చేసిండు కేసీఆర్ అని అన్నారు. గతంలో కేసీఆర్ రాకముందు మొత్తం రాష్ట్రంలో ఉమ్మడి తెలంగాణలో 5 మెడికల్ కాలేజీలు కూడా లేకపోతే వాటిని 32 మెడికల్ కాలేజీలు చేయడానికి, ప్రతీ జిల్లాలో పేద విద్యార్థులకు నర్సింగ్ విద్య అందించడానికి 32 మెడికల్ కాలేజీలు, 32 నర్సింగ్ కాలేజీలు కట్టించడానికి అప్పు చేశారు. ప్రతి జిల్లాలో మెడికల్, నర్సింగ్ కాలేజీలతో వైద్య విద్యను అందించారు. కరెంటు కష్టాల రాష్ట్రాన్ని 24 గంటల విద్యుత్ రాష్ట్రంగా మార్చారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో సాగు విస్తీర్ణాన్ని పెంచారు. ఉమ్మడి నల్గొండ జిల్లాకు మూడు మెడికల్ కాలేజీలు ఇచ్చారు. నల్గొండను వేధించిన ఫ్లోరోసిస్‌ను మిషన్ భగీరథతో తరిమికొట్టిన నాయకుడు మన కేసీఆర్ అని కేటీఆర్ పేర్కొన్నారు. దామరచర్లలో అతిపెద్ద యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌ను స్థాపించినది కూడా కేసీఆర్. యావత్ దేశ ప్రజలు అబ్బురపడేలా యాదాద్రి లక్ష్మీ నరసింహ స్వామి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన నాయకుడు మన కేసీఆర్ అని అన్నారు.

## గాంధీజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం

చండూరు : నల్లగొండ జిల్లా మునుగోడు నియోజకవర్గం చండూరు మున్సిపల్ కేంద్రం వాటర్ ట్యాంక్ సెంటర్‌లో ఆదివారం గాంధీజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని చండూరు మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులుప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండల తీవ్రత రోజురోజుకు పెరిగిపోతున్నదని అన్నారు. నిత్యం పరిసర గ్రామాల నుంచి చండూరు పట్టణానికి వివిధ పనుల కోసం వచ్చే ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. గాంధీజీ ఫౌండేషన్ ప్రతినెల నిరుపేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఎన్ని పదవులు అనుభవించినా, ఎంత సంపాదించినా ప్రజలకు సేవ చేయటంలోనే ఆనందం ఉంటుందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ బూతరాజు దశరథ, కౌన్సిలర్లు కోడి సుష్మా వెంకన్న, బుషిపాక వాసు, కటకం రమేష్, కో ఆప్షన్ సభ్యులు కల్లెట్ల చంద్రకళ మారయ్య సాగర్, తదితరులు పాల్గొన్నారు.

# అనుష్కని కాసేపే చూపిస్తే ఎలా





అభిమానులు స్వీటీ అని పిలుచుకునే అనుష్క మలయాళం డెబ్యూ కథనర్ తో జరగబోతోంది. ఇవాళ ట్రైలర్ లాంచ్ చేశారు. జయసూర్య హీరోగా నటిస్తున్న ఈ పీరియాడిక్ డ్రామాలో ప్రభుదేవా, వినీత్ లాంటి సీనియర్ ఆర్టిస్టులు చాలా ఉన్నారు. మాయాజాలం బ్యాక్ డ్రాప్ లో తొమ్మిదో శతాబ్దానికి చెందిన ఒక చక్రవర్తి నేపథ్యంతో తీస్తున్నారు. హోమ్ లాంటి తక్కువ బడ్జెట్ తో ఆకట్టుకున్న రోజిన్ థామస్ ఈ కథనార్ ద్వారా సరికొత్త ప్రపంచాన్ని పరిచయం చేయబోతున్నాడు.మూడు నిమిషాల ట్రైలర్ లో అనుష్కని కేవలం రెండు షాట్లకు పరిమితం చేయడం పట్ల ఫ్యాన్స్ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. హీరోయిన్ గా కీలకమైన పాత్ర పోషించినప్పుడు కంటెంట్ లో తగిన ప్రాధాన్యం ఇవ్వాలి. కానీ అలా చూపించి చూపించకుండా దాచి పెట్టడం ఏమిటని నిలదీస్తున్నారు. అంత లెన్త్ ఉన్నప్పటికీ కథేంటో పూర్తిగా అర్థం కాకుండా ఎడిట్ చేయడం విశేషం. ఏదో ఉందనే ఫీలింగ్ కలిగిస్తూనే సవాలక్ష డౌట్లు మిగిలిపోయేలా విజువల్స్ చూపించారు.గత ఏడాది ఘాటీ డిజాస్టర్ తర్వాత అనుష్క మళ్ళీ కనిపించలేదు. దాని ప్రమోషన్లకు సైతం హాజరు కాలేదు. మరి కథానార్ కోసమైనా బయటికి వస్తుందేమో చూడాలి. మొత్తం 15 భాషల్లో విడుదలకు రెడీ అవుతున్న ఈ హిస్టారికల్ డ్రామాకు రాహుల్ సుబ్రమణియన్ సంగీతం సమకూర్చారు. విడుదల తేదీ ఇంకా లాక్ చేయలేదు. మల్టీ లాంగ్వేజ్ కాబట్టి సానుకూలమైన సోలో రిలీజ్ కోసం నిర్మాతలు ట్రై చేస్తున్నారు. బహుశా వేసవిలోనే థియేటర్ రిలీజ్ ఉండొచ్చు.పెళ్లి వార్తలు గట్టిగా తిరుగుతున్న టైంలో అనుష్క ఇలా దర్శనం ఇవ్వడం బాగుంది కానీ మీడియా కెమెరా ముందుకు రావాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. చాలా కాలంగా ఇండస్ట్రీకి దూరంగా ఉన్న స్వీటీ కనీసం పెళ్లిళ్లు, ఈవెంట్లకు కూడా రావడం లేదు. కారణాలు ఏమైనా ఓసారి తనను లైవ్ లో చూడాలని ఎదురు చూస్తున్న మూవీ లవర్స్ బోలెడు ఉన్నారు. కథానార్ లో నీలి అనే పవర్ ఫుల్ పాత్రలో అనుష్క కనిపించనుంది. అందులో చాలా షాకింగ్ ఎలిమెంట్స్ ఉంటాయట.

# శాశ్వత్ సచ్ దేవ్... మనకు సూటవుతాడా



దురంధర్ ది రివెంజ్ విడుదలయ్యాక ఈ సినిమాలోని పాటలు చాలా వైరల్ అవుతున్నాయి. మొదటి భాగంలోనూ ఛార్ట్ బస్టర్స్ ఉన్నప్పటికీ సీక్వెల్ మ్యూజిక్ కు వస్తున్న రెస్పాన్స్ వేరే లెవెల్ లో ఉంది. ముఖ్యంగా సంగీత దర్శకుడు శాశ్వత్ సచ్ దేవ్ పేరు జనం నోళ్ళలో బాగా నానుతోంది. ఫోక్, వెస్ టర్న్, క్లాసిక్ అన్ని మిక్స్ చేసి వెరైటీ కంపోజింగ్ తో ఆకట్టుకుంటున్న తీరు సంగీత ప్రియులను విశేషంగా మెప్పిస్తోంది. రీమిక్సులతోనూ ఇతను అదరగొడుతున్నాడు.ఇప్పుడు చాలా మంది కళ్ళు శాశ్వత్ సచ్ దేవ్ మీద ఉన్నాయి. తమ ప్రాజెక్టుల్లో భాగం చేసుకునేందుకు కొందరు స్టార్ డైరెక్టర్లు ఆల్రెడీ ట్రై చేస్తున్నట్టు సమాచారం. రామ్ చరణ్ -- సుకుమార్ కాంబో మూవీకి తనే ఉండొచ్చనే ప్రచారం ఫిలిం నగర్ వర్గాల్లో ఉంది. కారణం లేకపోలేదు. నిఖిల్ హీరోగా రూపొందుతున్న ది ఇండియా హౌస్ కి చరణ్ నిర్మాణ భాగస్వామిగా ఉన్నాడు. దానికి మ్యూజిక్ ఇస్తున్నది శాశ్వత్ సచ్ దేవే. సో అలా కనెక్షన్ కుదురుతుందని కొందరి అభిప్రాయం.ఇదలా ఉంచితే శాశ్వత్ సచ్ దేవ్ వర్క్ స్టయిల్ చాలా విభిన్నంగా ఉంటుంది. హిందీ వరకు ఓకే కానీ అతని సెన్సిబిలిటీస్ మన కథలకు సూట్ అవుతాయా అనే అనుమానం సబబే. రాజస్థాన్ నుంచి వచ్చిన ఈ టెర్రిఫిక్ టాలెంట్ 2017లో తన సంగీత ప్రయాణం మొదలుపెట్టినప్పటికీ ఇప్పటిదాకా పూర్తి స్థాయిలో పని చేసింది ఏడు సినిమాలకే. మరో అయిదారు చిత్రాలకు వేరే కంపోజర్స్ తో కలిసి ట్యూన్స్ ఇచ్చాడు. అంత సెలెక్టివ్ గా ఉంటాడన్న మాట.అలాంటప్పుడు సౌత్ ఇండియన్ సినిమాలకు వెంటనే ఒప్పేసుకుంటాడని చెప్పలేం. ది ఇండియా హౌస్ కూడా రెగ్యులర్ మూవీ కాకపోవడం, దేశభక్తితో ముడిపడిన అంశాలు ఉండటం వల్లే పని చేస్తున్నాడని ఇన్ సైడ్ టాక్. సో రెగ్యులర్ కమర్షియల్ జానర్ కి ఎంతమేరకు బెస్ట్ ఇస్తాడనేది ఇప్పుడే చెప్పలేం. పంజాబీ ఫ్లేవర్ ఎక్కువగా ఉండే సచ్ దేవ్ పాటలకు కోట్లాది సంఖ్యలో వీర ఫాలోయింగ్ ఉంది. మరి అతన్ని ఏ తెలుగు దర్శకుడు ఒప్పిస్తాడో వేచి చూడాలి.

# ఏటీఎంలో చోరీ.. నిందితులు పరారీ

చిట్యాల, : ఏటీఎంలో నగదు చోరీ చేసి, పోలీసుల కళ్లుగప్పి పరారైన నిందితుల సంఘటన మండల కేంద్రమైన చిట్యాలలో చోటు చేసుకుంది. పోలీసులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన సమాచారం ప్రకారం నలుగురు నిందితులు ఆంధ్రప్రదేశ్‌లోని ఓ ఏటీ ఎంలో చోరీ చేసి దాదాపు రూ. కోటిన్నర నగదుతో ఏపీ 40 ఎఫ్ఎల్ 0512 నంబరు గల కారులో హైదరాబాదు వైపు పారిపోతున్నట్లు చిట్యాల పోలీసులకు సమాచారం అందింది. దీంతో చిట్యాల ఎస్ఐ రవికుమార్ మధ్యాహ్నం పట్టణంలోని యూనియన్ బ్యాంకు సమీపంలో వాహనాలను తనిఖీ చేస్తున్నారు.ఈ క్రమంలో నిందితులు పోలీసులను చూసి తమ వాహనాన్ని హైవేపై యూ టర్న్ తీసుకొని వ్యతిరేక మార్గంలో విజయవాడ వైపు పారిపోతున్నారు. ఇది గమనించి చిట్యాల పోలీసులు తమ వాహనంలో వారిని వెంబడించారు. పోలీసులను గమనించిన నిందితులు చిట్యాల ఎస్‌బీఐ సమీపంలో సర్వీసు రోడ్డులో కి వెళ్లి కొంత దూరం వెళ్లిన తర్వాత వేణుగోపాల స్వామి వెంచర్‌లోకి ప్రవేశించారు. వెనుకనే పోలీసులు వెంబడించడాన్ని గమనించి ఓ వెంచర్‌లోని రూం వద్ద చెట్ల చాటున కారు నిలిపి, నగదుతో పారిపోయారు. పోలీసులు అక్కడకు చేరుకునే లోపే వారు ఉడాయించారు. అనంతరం పోలీసులు కారు అద్దాలు పగులగొట్టి లాక్ తీశారు. క్లూస్ టీం సభ్యులు వచ్చి వేలిముద్రలు సేకరించారు. నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు.

# ప్రగతిలో గురువుల పాత్ర అమోఘం

ఖమ్మం,: గురుకులాల ప్రగతిలో గురువుల పాత్ర అమోఘం అని, ఖమ్మం జిల్లాలోని గురుకుల పాఠశాలల్లో విద్యా సంవత్సరాన్ని అత్యంత క్రమశిక్షణతో, ఉత్తమ ఫలితాలతో పూర్తి చేసుకున్న విద్యార్థినీ విద్యార్థులకు స్వేరో జిల్లా అధ్యక్షులు తగరం శ్రీకాంత్ స్వేరో ఓ ప్రకటనలో శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు తగరం శ్రీకాంత్ స్వేరో మాట్లాడుతూ.. విద్యార్థులను కేవలం పాఠాలకే పరిమితం చేయకుండా, వారిని బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దుతున్న జోనల్ ఆఫీసర్ అలివేలు, వివిధ పాఠశాలల ప్రిన్సిపాల్స్‌కు, అహర్నిశలు శ్రమిస్తున్న ఉపాధ్యాయ బృందానికి, సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నాణ్యమైన విద్యతో పాటు, విద్యార్థుల ఆరోగ్య సంరక్షణలో వారు చూపిస్తున్న చొరవ అభినందనీయమని కొనియాడారు.వేసవి సెలవుల కోసం ఇళ్లకు వెళ్తున్న విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా, తమ ఆరోగ్యాన్ని కాపాడుకుంటూనే కొత్త నైపుణ్యాలను పెంపొందించుకోవాలని స్వేరో నెట్వర్క్ ఆకాంక్షిస్తుందన్నారు. సెలవుల్లో పిల్లల పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వారి బంగారు భవిష్యత్తుకు పునాది వేసేలా సముచిత మార్గదర్శకత్వం అందించాలని కోరారు. కొత్త లక్ష్యాలతో, రెట్టింపు ఉత్సాహంతో తదుపరి విద్యా సంవత్సరానికి సిద్ధం కావాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా స్వేరో జిల్లా కమిటీ తరుపున విద్యార్థులందరికీ ఉజ్వల భవిష్యత్తు ఉండాలని ఆకాంక్షించారు.

# రవాణా రంగంలో సరికొత్త విప్లవం!

న్యూఢిల్లీ: భారతీయ రైల్వే చరిత్రలో చారిత్రక ఘట్టానికి నాంది పడింది. గంటకు 280 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే బీ-28 (దీ28) హై-స్పీడ్ రైలును మన దేశంలోనే రూపొందించడం 'ఆత్మనిర్భర్ భారత్' సంకల్పానికి నిలువెత్తు సాక్ష్యం. బీఈఎమ్ఎల్ సంస్థ ఆవిష్కరించిన ఈ నమూనా దేశ రవాణా ముఖచిత్రాన్ని మార్చబోతోంది.భారతదేశం ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్న హై-స్పీడ్ రైలు కల సాకారం అయ్యే దిశగా వేగంగా అడుగులు పడుతున్నాయి. ఇప్పటి వరకు వందే భారత్ రైళ్ల వేగాన్ని చూసి మురిసిపోయాం, కానీ ఇప్పుడు బీఈఎమ్ఎల్ ఆవిష్కరించిన బీ-28 నమూనా అంతకు మించిన వేగంతో ప్రయాణించగలదు. గంటకు 280 కిలోమీటర్ల గరిష్ట వేగంతో ప్రయాణించేలా రూపొందించిన ఈ రైలు, ప్రపంచంలోని అత్యుత్తమ హై-స్పీడ్ రైళ్లతో పోటీ పడనుంది. పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో, మన దేశీయ అవసరాలకు తగ్గట్టుగా రూపొందించడం విశేషం.బీ-28 ప్రత్యేకతలు..ఈ రైలు కేవలం వేగం మాత్రమే కాదు, ప్రయాణికుల సౌకర్యం, భద్రతలో కూడా అత్యుత్తమంగా ఉండబోతోందట. గంటకు 280 కిమీ వేగంతో ప్రయాణించడం అంటే.. 500 కిలోమీటర్ల దూరాన్ని కేవలం 2 గంటల్లోనే చేరుకోవచ్చు. ఇది విమాన ప్రయాణానికి పోటీ ఇవ్వనుంది. రైలు ముందు భాగం గాలిని చీల్చుకుంటూ వెళ్లేలా రూపొందించారు. దీనివల్ల వేగం పెరగడమే కాదు.. విద్యుత్ వినియోగం కూడా తగ్గుతుంది. జపాన్ లేదా ఇతర దేశాల సాయం లేకుండా, మన ఇంజినీర్లు దీనిని డిజైన్ చేయడం వల్ల తయారీ ఖర్చు తగ్గడం, భవిష్యత్తులో విడిభాగాల నిర్వహణ సులభతరం అవుతుంది.వందే భారత్, బీ-28లో తేడాలు ఇవే..వందే భారత్ రైళ్లు ప్రస్తుతం గరిష్టంగా గంటకు 160-180 కిమీ వేగంతో నడుస్తున్నాయి. కానీ బీ-28 ప్రత్యేకంగా హై-స్పీడ్ కారిడార్ల కోసమే రూపొందించారు. ఈ రైలు ప్రయాణించడానికి ప్రస్తుతం ఉన్న పట్టాలు సరిపోవు. వీటి కోసం ప్రత్యేకంగా ఎలివేటెడ్ లేదా అత్యాధునిక హై-స్పీడ్ ట్రాక్స్ నిర్మించాల్సి ఉంటుంది. యూరప్, జపాన్ దేశాల్లోని బుల్లెట్ రైళ్ల స్థాయికి మన రైల్వేను తీసుకువెళ్లడమే ప్రాజెక్టు ఉద్దేశ్యం.ఆర్థిక, సామాజిక ప్రభావంహై-స్పీడ్ రైళ్ల రాకతో ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపు వస్తుంది. నగరాల మధ్య ప్రయాణ సమయం తగ్గడం వల్ల వ్యాపార వాణిజ్యాలు మెరుగుపడతాయి. ప్రజలు పని కోసం ఉదయం ఒక నగరానికి వెళ్లి, సాయంత్రానికి ఇంటికి చేరుకునే వీలు కలుగుతుంది. విమాన ప్రయాణంతో పోలిస్తే రైలు ప్రయాణం తక్కువ కర్బన ఉద్గారాలను రిలీజ్ చేస్తుంది. ఇది పర్యావరణ పరిరక్షణకు తోడ్పడుతుంది. ఈ భారీ ప్రాజెక్టుల వల్ల తయారీ రంగంలో వేలాది మందికి ఉపాధి లభిస్తుంది.బీఈఎమ్ఎల్ ఆవిష్కరించిన ఈ బీ-28 నమూనా, భారతీయ రైల్వేను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లడంలో కీలకమైన పాత్ర పోషించనుంది.

# ఎమ్మెల్యే పద్మావతి సహకారంతో సదుపాయాలు కల్పిస్తాం

సూర్యాపేట, ఎమ్మెల్యే పద్మావతి సహకారం తో అన్ని వార్డులకు మౌలిక సదుపాయాలు కల్పిస్తాం అని కోదాడ మున్సిపల్ ఛైర్మన్ ఎర్నేని కుసుమ వెంకట్ రత్నం బాబు అన్నారు.కోదాడ మున్సిపల్ పరిధి లోని 31వ వార్డు లో డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. కోదాడ పట్టణంలో దశల వారీగా అన్ని వార్డులకు సీసీ లు, డ్రైనేజీలు ఇతర వసతులు కల్పిస్తాం అన్నారు.వార్డు కు సంబంధించిన ఏసమస్య ఉన్నా స్థానిక కౌన్సిలర్ ద్వారా నా దృష్టి కి తేవాలనీ ఆ సమస్యను ఎమ్మెల్యే పద్మావతి గారి దృష్టి కి తీసుకెళ్ళి పరిష్కరిస్తామన్నారు. జిల్లా లో కోదాడ మున్సిపాలిటీ నీ అగ్రస్థానంలో నిలుపుతాం అన్నారు. డ్రైనేజీ పనులు నాణ్యంగా త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ తిపిరి శెట్టి రాజు, ఖాసీం, మైలర శెట్టి భాస్కర్, లైటింగ్ ప్రసాద్ వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# ఈ ఎన్నికల్లో బీజేపీకి అనుకూలమైన..

## ఫలితాలు వస్తాయి- ప్రధాని నరేంద్ర మోదీ



బోంగావ్ : మహిళలపై అత్యాచారాలు, హింసకు పాల్పడే దుర్మార్గులను మే 4 తర్వాత అధికారం లోకి వచ్చే బంగాల్‌లోని బీజేపీ ప్రభుత్వం కఠినంగా శిక్షిస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. బంగాల్‌లోని బోంగావ్‌లో రెండో విడత పోలింగ్‌కు మోదీ ప్రచారం నిర్వహించారు. సందేశ్‌ఖాలీ బాధితురాలికి, ఆర్జీకర్ ఆస్పత్రి వైద్యురాలి తల్లికి బీజేపీ టికెట్లు కేటాయించిందని ఈ సందర్భంగా మోదీ గుర్తుచేశారు. ఈ నిర్ణయం ద్వారా బంగాల్ మహిళల పట్ల బీజేపీకి ఉన్న నిబద్ధత స్పష్టమైందని వ్యాఖ్యానించారు. టీఎంసీ ప్రభుత్వం బంగాల్ మహిళలను హింసించే గూండాలకు అండగా నిలుస్తోందని, ఇకపై దీనిని ప్రజలు సహించబోరన్నారు. టీఎంసీ సృష్టించిన మహా జంగల్ రాజ్ నుంచి బీజేపీ విముక్తి కల్పిస్తుందన్నారు. బంగాల్ ఎన్నికల మొదటి దశలోనే టీఎంసీ అహంకారం బద్దలైందని, రెండో దశ ఎన్నికలు బీజేపీ విజయాన్ని ఖాయం చేస్తాయని మోదీ జోస్యం చెప్పారు. అంతేకాదు 'మా, మాటి, మనుష్ ' (తల్లి, నేల, ప్రజలు) అనే నినాదానికి టీఎంసీ తూట్లు పొడిచిందని మోదీ ఆరోపించారు. రాష్ట్రాన్ని జంగిల్ రాజ్ నుంచి విముక్తి చేసేందుకు తమ బీజేపీ పార్టీకి ఓటు వేయాలని బంగాల్ ప్రజలను కోరారు. బంగాల్ రెండో దశ పోలింగ్ కోసం ఎన్నికల ప్రచారం చేస్తున్న మోదీ, విజయ్ సంకల్ప్ సభను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ ఎన్నికల్లో బీజేపీకి అనుకూలమైన ఫలితాలు వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన అధికార టీఎంసీపై విమర్శల వర్షం కురిపించారు. "టీఎంసీ ఇక్కడ తల్లులను ఏడిపించింది. మాతృభూమిని సిండికెట్లు, చొరబాటుదారులకు అప్పగించింది. సామాన్య ప్రజలను బహిష్కరణకు గురయ్యేలా చేసింది" అని ఆయన మండిపడ్డారు. "మొదటి దశలో బంగాల్ కమాల్ కర్ దియా (అద్భుతం చేసింది). ఏప్రిల్ 29న జరగనున్న చివరి దశ ఎన్నికల్లో కూడా అదే తరహా మద్దతు తెలపాలని నేను ఓటర్లను కోరుతున్నాను. ఇప్పటికే తృణమూల్ కాంగ్రెస్ అహంకారం అణగిపోయింది. ఇప్పుడు రెండో దశలో బీజేపీ చారిత్రాత్మక విజయం ఖాయం కానుంది. బంగాల్ ఎన్నికలు చివరి దశకు చేరుకున్నాయి.15 ఏళ్ల క్రితం 'మా, మాటి, మనుష్' నినాదంతో టీఎంసీ అధికారంలోకి వచ్చింది. కానీ ఇప్పుడు వారు ఆ మాటలు కూడా పలకడం లేదు. ఎందుకు ఒకవేళ ఆ నినాదాన్ని గుర్తుచేసుకుంటే, వారి పాపాలు బయటపడతాయని వారికి తెలుసు. టీఎంసీ క్రూరత్వం వల్ల తల్లులు కన్నీరు పెడుతున్నారు. ఇక్కడి నేల చొరబాటుదారుల పరమైపోయింది. స్థానిక ప్రజలు సొంత నేల నుంచి వెలివేయబడ్డారు."బంగాల్ ను టీఎంసీ జంగిల్ రాజ్ నుంచి బీజేపీ విముక్తి చేస్తుందని మోదీ పేర్కొన్నారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ నినాదాన్ని ప్రజలకు గుర్తు చేస్తూ, "బంగాల్ వద్ద అన్నీ ఉన్నాయి. ఇక్కడి ప్రజలకు అపారమైన సామర్థ్యం ఉంది. అందుకే బంగాల్ మళ్లీ దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రం కాగలదు. 'మీరు నాకు రక్తం ఇవ్వండి. నేను మీకు స్వేచ్ఛను ఇస్తాను' అన్న నేతాజీ పిలుపును గుర్తుంచుకోవాలి. ఆయన పిలుపునకు స్పందించి దేశ ప్రజలు సర్వస్వం త్యాగం చేశారు. అదే విధంగా ఈ రోజు బంగాల్ కు మీ నుంచి కేవలం ఒక ఓటు కావాలి. మాకు మీ దీవెనెలతో సహా ఓటు అందించండి. మిమ్మల్ని మేము టీఎంసీ పాలన నుంచి విముక్తి చేస్తాం" అని మోదీ పేర్కొన్నారు.బంగాల్ పారిశ్రామిక వృద్ధిని టీఎంసీ అడ్డుకుందని, అవినీతి, సిండికేట్ రాజ్యానికి తెరలేపిందని మోదీ ఆరోపించారు. "టీఎంసీ జంగిల్ రాజ్ తో ఒక అల్పస్థాయి మంత్రి లేదా గూండా కూడా తానే సర్వస్వం అని భావించే పరిస్థితి వచ్చింది. 24 పరగణాలు, హూగ్లీ నదీ పరివాహక ప్రాంతాలు ఒకప్పుడు పరిశ్రమలకు నిలయాలుగా ఉండేవి. కానీ నేడు అక్కడి మిల్లులు మూతపడుతున్నాయి. బ్రిటీష్ కాలం నాటి ఫ్యాక్టరీలు కూడా మూతపడ్డాయి. కేవలం సిండికేట్ , లంచగొండితనంతో నడిచే ఒకే ఒక వ్యాపారం అక్కడ సాగుతోంది" అని ఆయన ఆరోపించారు. కాగా, ఎన్నికల కమిషన్ గణాంకాల ప్రకారం, ముగిసిన మొదటి దశ బంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో 91.78 శాతం పోలింగ్ నమోదైంది. ఇక రెండో దశ పోలింగ్ ఏప్రిల్ 29న జరగనుంది. మే 4న ఓట్ల లెక్కింపు ఉంటుంది.

# ప్రధాని మోదీ ఈ దేశాన్ని ఉగ్రవాదం నుంచి విముక్తి చేశారు



నాడియా : బంగాల్ రెండో దశ ఎన్నికల ప్రచారంలో భాగంగా నాడియాలో మాట్లాడిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా టీఎంసీ, కాంగ్రెస్ పార్టీలపై విమర్శలు గుప్పించారు. గతంలో బంగాల్ లో మమతా బెనర్జీ, కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రభుత్వాలు ఉగ్రవాదుల పట్ల మెతక వైఖరి అవలంబించాయని ఆరోపించారు. కానీ 2014లో మోదీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత నుంచి సర్జికల్ , ఎయిర్ స్ట్రైక్స్ లాంటి చర్యలతో ఉగ్రదాడులకు నిర్ణయాత్మకమైన సమాధానం ఇచ్చిందని అన్నారు."మమతా బెనర్జీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు అధికారంలో ఉన్నప్పుడు ఉగ్రవాదులకు బిర్యానీలు తినిపించేవారు. 2014లో మోదీ సర్కార్ అధికారంలోకి వచ్చాక, ఉరీలో దాడి జరిగితే మేము సర్జికల్ స్ట్రైక్ చేశాం. పుల్వామాలో దాడి జరిగితే ఎయిర్ స్ట్రైక్ నిర్వహించాం. పహల్గాంలో దాడి చేసినప్పుడు, నేరుగా పాక్ గడ్డపైకి వెళ్లి ఆపరేషన్ సిందూర్ ద్వారా ఉగ్రవాదులను తుదముట్టించాం. ప్రధాని మోదీ ఈ దేశాన్ని ఉగ్రవాదం నుంచి విముక్తి చేశారు."బంగాల్ లో బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే అక్రమ చొరబాటుదారులను గుర్తించి, వారిని బహిష్కరిస్తామని అమిత్ షా పేర్కొన్నారు."ప్రధాని మోదీ ఈ దేశాన్ని నక్సలిజం నుంచి విముక్తం చేశారు. ఇప్పుడు బంగాల్ లో బీజేపీ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురండి. మేము చొరబాటుదారులను ఒక్కొక్కరిగా ఏరిపారేస్తాం. చొరబాటుదారుల పేర్లను ఎందుకు తొలగిస్తున్నారని దీదీ అడుగుతున్నారు దీదీ మీ సమయం ముగిసింది. మే 4వ తేదీన బీజేపీ ప్రభుత్వం రానుంది. బీజేపీ ముఖ్యమంత్రి పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత, మేము ఓటర్ల జాబితా నుంచి చొరబాడుదారులను తొలగించడమే కాకుండా, బంగాల్ గడ్డ నుంచి వారిని ఏరిపారేస్తాం.''నాడియా జిల్లాలోని టెహట్టాలో జరిగిన బహిరంగ సభలో అమిత్ షా, మమతా బెనర్జీ సర్కార్ పై విమర్శల జల్లు కురిపించారు. ఈ అసెంబ్లీ ఎన్నికల మొదటి దశలోనే ఓటర్లు మమతా బెనర్జీ ప్రభుత్వాన్ని తుడిచిపెట్టేశారని వ్యాఖ్యానించారు. ఏప్రిల్ 23న జరిగిన మొదటి దశ ఎన్నికల్లోనే బీజేపీ 110 సీట్లను గెలుచుకుంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.'బంగాల్ బాధ్యతలు బీజేపీ చేపడితే ఇక్కడ కొనసాగుతున్న గూండా రాజ్యం, సిండికేట్ రాజ్ లకు ముగింపు లభిస్తుంది. ఓటు వేసేందుకు బయటకు రావడానికి ఎవరూ భయపడకండి. ఎన్నికల సంఘం తగిన ఏర్పాట్లు చేసింది. మిమ్మల్ని ఓటు వేయకుండా ఆపడం ఎవరి వల్లా కాదు' అని అమిత్ షా ఓటర్లకు పిలుపునిచ్చారు. అయితే ఈ సభకు భారీ సంఖ్యలో ప్రజలు హాజరైనప్పటికీ, అకస్మాత్తుగా భారీ వర్షం కురవడంతో, అమిత్ షా తన ప్రసంగాన్ని మధ్యలోనే ముగించాల్సి వచ్చింది.సభకు భారీ సంఖ్యలో ప్రజలు హాజరైనప్పటికీ, అకస్మాత్తుగా కురిసిన భారీ వర్షం కారణంగా ఈ సీనియర్ బీజేపీ నేత తన ప్రసంగాన్ని మధ్యలోనే ముగించాల్సి వచ్చింది.అంతకు ముందు, అంటే శనివారం టోలీగంజ్ లో అమిత్ షా భారీ రోడ్ షో నిర్వహించారు. ఆ సందర్భంగా బంగాల్ ఎన్నికల సమయంలో ఓటర్లను భయభ్రాంతులకు గురిచేయడానికి ప్రయత్నిస్తే, టీఎంసీ గూండాలపై కఠిన చర్యలు తీసుకుంటామని అమిత్ షా హెచ్చరించారు. "నేను ఇప్పుడు గూండాలకు హెచ్చరిస్తున్నా. ఏప్రిల్ 29న మీ ఇళ్ల నుంచి బయటకు రావద్దు. లేకపోతే మే 5వ తేదీ తర్వాత మీపై కనికరం ఉండదు. ఏప్రిల్ 29న ఉదయం 7 గంటలకు తల్లులు, సోదరీమణులు, యువకులు అందరూ పోలింగ్ బూత్ లకు చేరుకుని కమలం గుర్తుపై బటన్ నొక్కాలని నేను కోరుతున్నాను" అని అన్నారు.కాగా, ఎన్నికల కమిషన్ గణాంకాల ప్రకారం, గురువారం ముగిసిన మొదటి దశ బంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధికంగా 91.78 శాతం ఓటింగ్ నమోదైంది. ఇక రెండో దశ పోలింగ్ ఏప్రిల్ 29న జరగనుండగా, ఓట్ల లెక్కింపు మే 4న జరగనుంది.

# మే 10వ తేదీ వరకు అవకాశం

హైదరాబాద్, : జనగణన స్వీయ నమోదు (సెల్ఫ్ ఎన్యుమరేషన్) చేసుకోవాలని తెలంగాణ ప్రజలకు కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లో జనగణనలో భాగంగా దిల్ కుశ గెస్ట్ హౌస్‌లో అధికారుల సమక్షంలో మంత్రి కిషన్ రెడ్డి స్వీయ నమోదు చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 'తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత జరుగుతున్న మొట్టమొదటి అధికారిక జనాభా గణన ఇది. రాష్ట్రాభివృద్ధి కోసం రూపొందించే ప్రణాళికలకు ఇది పునాది కానుంది. ప్రధానమంత్రి మోదీ అన్నట్లు "మదర్ ఆఫ్ డెమోక్రసీ"లో భాగస్వామ్యం కావడం అంటే, దేశ భవిష్యత్తును నిర్ణయించే ప్రక్రియలో ప్రతి పౌరుడు తన వంతు పాత్ర పోషించడమే. ప్రజలు తమ వివరాలను స్వయంగా నమోదు చేసుకునేందుకు మే 10వ తేదీ వరకు అవకాశం కల్పించడం గొప్ప పరిణామం.ఇది పారదర్శకతను పెంచడమే కాకుండా, సమయాన్ని ఆదా చేస్తుంది. ?చాలామంది తమ వివరాలు ఇస్తే ప్రభుత్వ పథకాలు నిలిచిపోతాయేమో అని ఆందోళన చెందుతుంటారు. దీనిపై ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. మీరు ఇచ్చే వివరాల వల్ల వ్యక్తిగతంగా ఎలాంటి ఇబ్బందులు కలగవు. ?జనాభా లెక్కల్లో వివరాలు ఇవ్వడం వల్ల సంక్షేమ పథకాల దూరం కావు. ఇది కేవలం గణాంకాల కోసం మాత్రమే. ?జనాభా లెక్కలు కేవలం తలల లెక్క కాదు.. అవి దేశ భవిష్యత్తుకు దిక్సూచీ. ?పథకాల రూపకల్పనకు ఏ ప్రాంతంలో ప్రజల అవసరాలు ఎలా ఉన్నాయి? సామాజిక, ఆర్థిక స్థితిగతులు ఎలా ఉన్నాయి? అనే అంశాల ఆధారంగానే కొత్త పథకాలు రూపొందిస్తారు.వాటికీ ఈ గణన ఉపయోగపడుతుంది. ?జనాభా నిష్పత్తిని బట్టే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధుల కేటాయింపు చేపడతాయి. అంతర్జాతీయ వేదికలపై భారతదేశం తన సత్తా, అవసరాలను చాటుకోవడానికి ఈ ఖచ్చితమైన గణాంకాలు అవసరం. ?దీనిని ఒక 'పండుగలా' భావించి ప్రజలంతా స్వచ్ఛందంగా పాల్గొనాలి. ప్రతి ఒక్కరూ ఖచ్చితమైన సమాచారాన్ని అందించడం ద్వారా, తమ ప్రాంత అభివృద్ధికి తామే పరోక్షంగా సహకరించినట్లు అవుతుంది. అధికారులు అడిగే వివరాలను నిర్భయంగా జవాబు చెప్పండి. తద్వారా రాబోయే పదేళ్ల అభివృద్ధిలో మీరు కూడా భాగస్వాములు కావాలని ప్రజలకు' కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.

# అవగాహన కార్యక్రమాలు అవసరం



హైదరాబాద్,: గుట్కా, పాన్ మసాలా, ఖైనీ, డ్రగ్స్ వంటి దురలవాట్లకు దూరంగా ఉండాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల వాడకం హానికరమని, వీటిని అరికట్టేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోందని ఆయన స్పష్టం చేశారు.రాయదుర్గంలోని సత్త్వ నాలెడ్జ్ పార్క్ వద్ద గ్లోబల్ ఓరల్ క్యాన్సర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన నోటి క్యాన్సర్ అవగాహన మరాథాన్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.మంత్రి శ్రీధర్ బాబు.. 10కే రన్‌ను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'పొగాకు ఉత్పత్తుల వాడకం వల్ల దేశంలో నోటి క్యాన్సర్ కేసులు ప్రమాదకరంగా పెరుగుతున్నాయి. ప్రతి సంవత్సరం లక్షలాది మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఆరోగ్యకర సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ నడుం బిగించాలి' అని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొని యువతను ఉత్సాహపరిచారు. మరోవైపు సైబరాబాద్ సీపీ రమేశ్ 5కే రన్‌ను ప్రారంభించి, శాంతిభద్రతల పరిరక్షణతో పాటూ సామాజిక బాధ్యతగా ఇలాంటి అవగాహన కార్యక్రమాలు అవసరమని పేర్కొన్నారు. అలాగే డా. వకుళాభరణం కృష్ణ మోహన్ రావు 2కే రన్‌ను ప్రారంభించి, క్యాన్సర్ రహిత సమాజం కోసం వైద్యులు, పౌరులు కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.

# మే 1 నుంచి సర్కార్ మెట్రో




హైదరాబాద్: హైదరాబాద్ మెట్రో రైలు విషయంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మే 1నుంచి ప్రభుత్వ నిర్వహణలోకి హైదరాబాద్ మెట్రోరైలు రానుంది. ఈ మేరకు హైదరాబాద్ మెట్రో రైలు నిర్వహణకు ప్రభుత్వం కమిటీ వేసింది. సీఎస్ రామకృష్ణారావు చైర్మెన్‌గా మెట్రోరైలు కమిటీ ఏర్పాటు చేయగా హెచ్‌ఎంఆర్‌ఎల్ నిర్వహణకు 10 మంది సభ్యులతో కమిటీ ఏర్పాటు చేసింది. హెఎంఆర్ఎల్ ఎండీగా ఐఏఎస్ అధికారి సర్ఫరాజ్ అహ్మద్ బాధ్యతలు తీసుకోనున్నారు. హెచ్‌ఎంఆర్‌ఎల్ డైరెక్టర్లుగా జయేశ్‌రంజన్, వికాస్‌రాజ్, సందీప్ కుమార్ సుల్తానియా, శివధర్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, జితేశ్ వి.పాటిల్ ఉండగా హెచ్‌ఎంఆర్‌ఎల్ జాయింట్ ఎండీగా శివేంద్రప్రతాప్ నియామకమయ్యారు. మెట్రో ఈక్విటీ కొనుగోలుకు రూ.13,615 కోట్లు అవసరంఈ నెలాఖరులోగా(ఏప్రిల్) హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టు స్వాధీనానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చకచకా అడుగులు వేస్తోంది. ఈ మేరకు మొదటి దశ స్వాధీనానికి అవసరమైన ప్రక్రియకు సంబంధించి జీవో 127ను మెట్రోపాలిటన్ ప్రాంతం, పట్టణాభివృద్ధి శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ జయేశ్‌రంజన్ శుక్రవారం జారీచేశారు. ఎల్‌అండ్‌టీకి ఉన్న 100 శాతం ఈక్విటీ వాటా కొనుగోలు చేయడం, ఐఆర్‌ఎఫ్‌సీ నుంచి లోన్, ఒప్పందాల అమలు, ఇతర అంశాలతోపాటు క్యాబినెట్ సబ్‌కమిటీ చేసిన సిఫారసులతో హైదరాబాద్ మెట్రోరైలు లిమిటెడ్(హెచ్‌ఎంఆర్‌ఎల్) ఎండీ పలు ప్రతిపాదనలు చేశారు. వీటిపై క్యాబినెట్ భేటీలో తీసుకున్న నిర్ణయాల మేరకు తాజాగా ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది.టేకోవర్‌కు సంబంధించి షేర్ పర్చేజ్ అగ్రిమెంట్, ఐఆర్‌ఎఫ్‌సీ నుంచి లోన్, రాష్ట్ర ప్రభుత్వం నుంచి అండర్‌టేకింగ్ లేఖ, ప్రభుత్వ గ్యారంటీ, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) నుంచి డైరెక్ట్ డెబిట్ మాండేట్, రుణ టర్మ్‌షీట్, త్రైపాక్షిక ఒప్పందం, హెచ్‌ఎండీఏ నుంచి ఈక్విటీ నిధుల సమీకరణతోపాటు పలు అంశాలను ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు



హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బలహీన వర్గాల పక్షాన నైపుణ్యం కలిగిన బీసీ మహిళలకు టైలరింగ్ ఆధారిత స్వయం ఉపాధి కల్పించి, వారి ఉత్పా దకతను పెంచి, టైలరింగ్ వ్యాపార అవకాశాలను విస్తరించుకుందని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. స్వయం సమృద్ధిగల పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు ఆటోమేటిక్ కుట్టు యంత్రాలను సరఫరా చేయాలని తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నియోజకవర్గానికి వెయ్యి మంది మహిళలకు వంద శాతం సబ్సిడీతో కుట్టు మిషన్లు మంజూరు చేస్తే స్వయం ఉపాధి పెంచుకొని ఆర్థికంగా ఆసరాగా ఎదగడానికి ఉపయోగపడు తుందని, మంత్రి తెలిపారు. పథకం అమలుపై బీసీ సంక్షేమ శాఖ సెక్రటరీ బాలమయాదేవి, బీసీ కార్పొరేషన్ ఎండీ మల్లయ్య బట్టు, ఇతర అధికారులతో మంత్రి పొన్నం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ... మహిళలకు స్వయం ఉపాధి కల్పించడానికి ప్రతి నియోజకవర్గానికి 1000 మంది మహిళలకు కుట్టు మిషన్లు 100 శాతం సబ్సిడీతో మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని, త్వరలోనే వాటికి అప్లికేషన్ తీసుకొని జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో ఎంపిక ప్రక్రియ జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచన మేరకు బలహీన వ ర్గాల మహిళలకు ఉపాధి అవకాశాలు మెరుగు పరచడానికి ఈ నిర్ణయం తీసుకోవడం జరిగిందని, బలహీన వర్గాల శాఖ పక్షాన నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు పెంచడంతోపాటు, స్కిల్ డెవలప్మెంట్ లాంటి కార్యక్రమాలు చేయడానికి శాఖ ప్రణాళికలు చేస్తుంది..మంత్రి పొన్నంని సత్కరించిన ఆర్టీసీ జేఏసి నేతలు ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించేలా ప్రభుత్వం నిర్వహించిన చర్చలు చరిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ని ఆర్టీసీ జేఏసి నేతలు సత్కరించి ధన్య వాదాలు తెలిపారు. తెలంగాణ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం ఆర్టీసీ కార్మికుల చిరకాల స్వప్నం నెరవేర్చిందనిజేఏసీనాయకులు పేర్కొన్నారు.

# పోలీసులు అప్రమత్తంగా ఉన్నారు

హైదరాబాద్, : రాష్ట్రంలో సైబర్ నేరాల కట్టడికి తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసిఎస్బి) సరికొత్త వ్యూహంతో ముందుకు సాగుతోంది. గడిచిన రెండేళ్లలో అరెస్టయిన నేరగాళ్లు మళ్లీ నేరాల బాట పట్టకుండా ఉండేలా 'ఆపరేషన్ క్రాక్‌డౌన్ 2.0' పేరిట భారీ నిఘా కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్ వెల్లడించారు. ఏప్రిల్ 25వ తేదీ ఉదయం 8 గంటల నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఈ ప్రత్యేక తనిఖీలు ప్రారంభమయ్యాయని, శాంతిభద్రతల విభాగం పోలీసులతో సమన్వయం చేసుకుంటూ ఈ ఆపరేషన్ నిర్వహిస్తున్నామని ఆమె పేర్కొన్నారు.సైబర్ నేరాల పట్ల తమది 'జీరో టాలరెన్స్' విధానమని సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్ స్పష్టం చేశారు. 2024-25 కాలంలో తెలంగాణ వ్యాప్తంగా మొత్తం 3,567 మంది సైబర్ నేరగాళ్లను అరెస్ట్ చేయగా, వారిలో రాష్ట్రానికి చెందిన 614 మంది ప్రధాన నిందితులపై ప్రస్తుతం ప్రత్యేక నిఘా ఉంచినట్లు ఆమె తెలిపారు. ఈ తనిఖీల కోసం 300 బృందాలు క్షేత్రస్థాయిలో రంగంలోకి దిగాయని, నిందితుల ప్రస్తుత నివాసం, వృత్తి, వారి ఆర్థిక లావాదేవీలను నిశితంగా పరిశీలిస్తున్నాయని శిఖా వివరించారు. ప్రతి నిందితుడి నివాసాన్ని జియో ట్యాగింగ్ చేయడం ద్వారా వారి కదలికలను నిరంతరం ట్రాక్ చేస్తున్నామని, వారు బెయిల్ నిబంధనలను అతిక్రమించకుండా చూస్తున్నామని ఆమె పేర్కొన్నారు. తెలంగాణలో 480 కేసులుసైబర్ నేరాల కేసుల్లో అరెస్టయిన వారిలో మ్యూల్ అకౌంట్ హోల్డర్లు (269), ఏజెంట్లు (155), చైల్డ్ సెక్షువల్ అబ్యూస్ మెటీరియల్ (సి ఎస్ ఏ ఎం ) నిందితులు (36), సైబర్ స్లేవరీకి పాల్పడేవారు (8) వంటి వివిధ రకాల నేరగాళ్లు ఉన్నట్లు డైరెక్టర్ వెల్లడించారు. ఇప్పటివరకు 335 మందిని భౌతికంగా తనిఖీ చేయగా వీరికి తెలంగాణలో 480 కేసులు, దేశవ్యాప్తంగా 1,233 కేసులతో సంబంధం ఉన్నట్లు గుర్తించామని శిఖా గోయల్ తెలిపారు. వీరిలో 218 మంది ఆచూకీ లభించగా, 115 మంది పరారీలో ఉన్నారని, ముగ్గురు మరణించారని ఆమె వెల్లడించారు. ఈ క్రమంలోనే సీఎస్ఈఏఎం కేసులో నిందితుడైన ప్రసాద్ కుమార్ అనే వ్యక్తి ప్రస్తుతం నేపాల్‌లో ఉన్నట్లు గుర్తించామని, గతంలో అతడు సికింద్రాబాద్‌లోని ఒక రెస్టారెంట్‌లో పని చేసేవాడని ఆమె వివరించారు.ఒకసారి అరెస్టయిన తర్వాత కూడా నిందితులు పోలీసుల నిఘాలోనే ఉంటారని 'ఆపరేషన్ క్రాక్‌డౌన్ 2.0' ద్వారా తెలియజేస్తున్నామని శిఖా గోయల్ పునరుద్ఘాటించారు. ఎవరైనా మళ్లీ నేరాలకు పాల్పడినట్లు తెలిస్తే లేదా అనుమానాస్పదంగా ప్రవర్తిస్తే వారిపై వెంటనే 'సస్పెక్ట్ షీట్లు' తెరిచి, కఠిన నిఘా ఉంచుతామని హెచ్చరించారు. పౌరులను సైబర్ మోసాల నుండి రక్షించేందుకు తెలంగాణ పోలీసులు అన్ని దశల్లోనూ అప్రమత్తంగా ఉన్నారని డైరెక్టర్ శిఖ గోయల్ భరోసా ఇచ్చారు.

# హైదరాబాద్, విజయవాడల్లో ఏఐ కొలువుల జోరు!

విజయవాడ: ఐటీ రంగంలో ఉద్యోగాల కోతలు, మాంద్యం భయాలు ఉన్నాయని వింటున్న తరుణంలో.. కేవలం ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటలీజెన్స్) విభాగంలో నియామకాలు 59.5% పెరగడం నిరుద్యోగులకు, టెక్ నిపుణులకు గొప్ప ఆశాకిరణం. ప్రపంచ దేశాలైన అమెరికా, యూకేను వెనక్కి నెట్టి భారత్ ఏఐ నైపుణ్యాల్లో అగ్రగామిగా ఎదుగుతుండడం విశేషం. లింక్డ్ఇన్ తాజా నివేదిక ప్రకారం.., భారత్ ప్రస్తుతం ప్రపంచ 'ఏఐ హబ్'గా మారుతోంది. గతేడాదితో పోలిస్తే ఏఐ ఇంజినీర్ల నియామకాల్లో 59.5% వృద్ధి నమోదు కావడం సామాన్యమైన విషయం కాదు. కేవలం బెంగళూరు వంటి మెట్రో నగరాలకే పరిమితం కాకుండా, తెలుగు రాష్ట్రాల్లోని హైదరాబాద్ (51%), విజయవాడ (45.5%) నగరాల్లో కూడా నియామకాలు పెరుగుతున్నాయి. జర్మనీ, ఫ్రాన్స్ వంటి అభివృద్ధి చెందిన దేశాల కంటే భారత్ ఏఐ సాంకేతికతను వేగంగా అందిపుచ్చుకుంటోందని గణాంకాలు నిరూపిస్తున్నాయి.భారీ డిమాండ్ కు కారణాలు.. ప్రతి సంస్థ ఇప్పుడు తన ఉత్పాదకతను పెంచుకోవడానికి ఆర్టిఫిషియల్ ఇంటలీజెన్స్‌ను ఒక అనివార్య సాధనంగా భావిస్తోంది. సాధారణ పనులను మనుషుల ప్రమేయం లేకుండా పూర్తి చేసే 'ఏఐ ఏజెంట్స్' వినియోగం పెరిగింది. దీనివల్ల కంపెనీల నిర్వహణ ఖర్చులు తగ్గుతున్నాయి. ఉద్యోగుల పనితీరును మెరుగుపరిచే ఏఐ ప్రొడక్టివిటీ టూల్స్ అభివృద్ధి చేయడానికి కంపెనీలు భారీగా పెట్టుబడులు పెడుతున్నాయి. అజూర్ ఏఐ స్టూడియో వంటి ప్లాట్‌ఫారమ్‌లపై పట్టున్న నిపుణులకు కంపెనీలు రెడ్ కార్పెట్ వేస్తున్నాయి.డిమాండ్‌లో ఉన్న నైపుణ్యాలు ఇప్పుడు కేవలం కోడింగ్ తెలిస్తే సరిపోదు. మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా కొత్త స్కిల్స్ తప్పనిసరిగా నేర్చుకోవాలి. డేటా నుంచి కీలకమైన అంశాలను స్వయంచాలక పద్ధతిలో సేకరించే నైపుణ్యం ఉండాలి. తయారు చేసిన ఏఐ మోడల్స్‌ను వాస్తవ ప్రపంచంలో ఎలా అమలు చేయాలి, పర్యవేక్షించాలో తెలిసిన వారికి డిమాండ్ ఎక్కువగా ఉంది. టెక్స్ట్, ఇమేజ్ లేదంటే కోడ్‌ను సృష్టించగల ఏఐ వ్యవస్థలను నిర్మించడంలో నిపుణులకు భారీ ప్యాకేజీలు లభిస్తున్నాయి. హైదరాబాద్ ఇప్పటికే ఐటీ హబ్‌గా గుర్తింపు సంపాదించింది. 51% నియామకాల వృద్ధి అంటే హైదరాబాద్ అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడుతోందని అర్థం. మరోవైపు విజయవాడలో 45.5% వృద్ధి నమోదవడం శుభపరిణామం అనే చెప్పాలి. సెకండ్ గ్రేడ్ నగరాల్లో కూడా ఏఐ కంపెనీలు తమ కార్యకలాపాలను విస్తరిస్తున్నాయని విజయవాడను చూస్తే తెలుస్తోంది. సాధారణ సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్ స్థానంలో ఇప్పుడు ఏఐ ఇంజినీరింగ్ వచ్చి చేరుతోంది.

# తెలంగాణలో రామ రాజ్యం నడుస్తుంది..



హైదరాబాద్, : సీఎం రేవంత్ రెడ్డి కర్కోటకుడు, రాష్ట్రంలో హిట్లర్ పరిపాలన సాగుతుందంటూ టీఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత చేసిన వ్యాఖ్యలు ఖండిస్తున్నామని టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్, ఎంపీ మల్లు రవి తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డిపై చేసిన వ్యాఖ్యలు విత్ డ్రా చేసుకోవాలంటూ కవితను ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. ఆ తర్వాతే ప్రజల్లోకి వెళ్లాలని ఆమెకు సూచించారు. మేడ్చల్‌లో కొత్త పార్టీ పేరు ప్రకటించిన సందర్భంగా కల్వకుంట్ల కవిత చేసిన వ్యాఖ్యలపై నాంపల్లిలోని గాంధీ భవన్‌లో ఎంపీ మల్లు రవి స్పందించారు.విమర్శించే హక్కు కవితకు లేదు..తెలంగాణలో రామ రాజ్యం నడుస్తుంటే కవితకు ఏ రకంగా హిట్లర్ రాజ్యం కనిపిస్తుందంటూ మల్లు రవి సందేహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఏ రాజ్యం నడుస్తుందో.. కవిత సభకు హాజరైన ప్రజలను అడిగితే తెలుస్తుందన్నారు. కొత్త పార్టీ పెట్టుకునే హక్కు కవితకు ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. తండ్రి, బిడ్డలు ఏమైనా మాట్లాడుకోవచ్చునని పేర్కొన్నారు. కానీ సీఎం రేవంత్ రెడ్డిని.. కాంగ్రెస్ పార్టీని విమర్శించే స్థాయి కవితకు లేదన్నారు.అందుకే బీఆర్ఎస్ నుంచి బయట కొచ్చింది..బీఆర్ఎస్, టీఆర్ఎస్ పార్టీల్లో కవిత 10 ఏళ్లు కీలక పదవులు అనుభవించిందని కాంగ్రెస్ ఎంపీ ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో కవిత అరెస్టయి జైలుకు వెళ్లినప్పుడు బీఆర్ఎస్ సరిగ్గా స్పందించలేదన్నారు. అందుకే ఆ పార్టీ నుంచి ఆమె బయటకు వచ్చిందని కుండబద్దలు కొట్టారు. 10 ఏళ్లు అధికారంలో ఉండి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఎందుకు కల్పించలేదని ఆయన కవితను సూటిగా ప్రశ్నించారు. తాము ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నామని చెప్పారు.కేసీఆర్‌ను కవిత ఎందుకు ప్రశ్నించ లేదు..ప్రజలకు మీరు ముక్క బియ్యం ఇచ్చారు.. కానీ తాము సన్న బియ్యం ఇస్తున్నామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేబినెట్‌లో మహిళలకు ఎందుకు చోటు కల్పించలేదని మీ తండ్రి కేసీఆర్‌ను ఎందుకు ప్రశ్నించలేదంటూ కవితను ఈ సందర్భంగా ఆయన నిలదీశారు. మీరు అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణను 50 ఏళ్లు వెనక్కి తీసుకుపోయారని మల్లు రవి మండిపడ్డారు.వారిద్దరికీ నోటీసులు ఇస్తాం.. రాష్ట్రంలో ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో పాలకుర్తి నియోజకవర్గ పరిధిలో కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా హరిప్రసాద్, కృష్ణ కిశోర్ పని చేశారంటూ స్థానిక ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, పార్టీ ఇన్‌చార్జ్ ఝాన్సీ రెడ్డి ఫిర్యాదు చేశారని మల్లు రవి తెలిపారు. ఈ నేపథ్యంలో హరి ప్రసాద్, కృష్ణ కిశోర్‌కు నోటీసులు ఇచ్చామన్నారు. తాను అమెరికాలో ఉన్నానని కృష్ణ కిషోర్ చెప్పారని.. తన ఇంట్లో ఫంక్షన్ ఉందని హరి ప్రసాద్ లేఖ రాశారని ఎంపీ మల్లు రవి చెప్పారు. 10 రోజుల్లో వివరణ ఇవ్వాలని వారిద్దరికీ షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని స్పష్టం చేశారు.పార్టీకి నష్టం జరుగుతుంది..బాధ్యత గల పదవుల్లో ఉన్న వ్యక్తులు పార్టీకి ఇబ్బంది కలిగే విధంగా మీడియాలో మాట్లాడుతున్నారని ఎంపీ మల్లు రవి ఆవేదన వ్యక్తం చేశారు. ఎవరికి వారు ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే పార్టీకి నష్టం జరుగుతుందని ఈ సందర్భంగా ఆయన కొంత అసహనం వ్యక్తం చేశారు.ప్రభుత్వపరంగా ఇబ్బంది కలిగితే..ఎవరికైనా ఇబ్బంది కలిగితే పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ దృష్టికి తీసుకెళ్లాలని పార్టీ నేతలు, కేడర్‌కు ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వ పరంగా ఇబ్బంది ఎదురైతే సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు.టీజీఎస్ ఆర్టీసీ కార్మికుల డిమాండ్లు అన్నీ పరిష్కరించామని ఆయన గుర్తు చేశారు. ప్రజా ప్రభుత్వంలో కార్మికులకు అన్యాయం జరగనీయమన్నారు. ఆర్టీసీ సమ్మెలో కార్మికుడు ఆత్మహత్య చేసుకుని చనిపోవడం దురదృష్టకరమని టీపీసీసీ క్రమశిక్షణ సంఘం చైర్మన్, ఎంపీ మల్లు రవి చెప్పారు.

# ప్రజలకు నమ్మకంగా ఉండేలా..

## సేవలు అందించాలి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



హైదరాబాద్: రాష్ట్రంలో ప్రజల అర్జీలు, ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మరింత పకడ్బందీగా అమలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రజావాణి సేవలను క్షేత్రస్థాయికి విస్తరించాలని సూచించారు. ప్రజా ప్రభుత్వం అధికారం చేపట్టిన మరుసటి రోజున ప్రజావాణి కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించారు. అప్పటి నుంచి ఇప్పటివరకు ప్రతి మంగళవారం, శుక్రవారం మహాత్మా జ్యోతిబా ఫూలే ప్రజాభవన్‌లో ప్రజావాణి విజయవంతంగా అమలవుతోందిని ఆయన పేర్కొన్నారు.అన్ని విభాగాలకు చెందిన అధికారులు అక్కడికక్కడే ప్రజలు ఇచ్చే అర్జీలు, దరఖాస్తులను స్వీకరించి వేగవంతంగా వాటిని పరిష్కరించే చర్యలు చేపడుతున్నారని. జిల్లా స్థాయిలోనూ కలెక్టర్ల ఆధ్వర్యంలో ప్రతి వారం ప్రజావాణి నిర్వహిస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు. దూర ప్రాంతాల నుంచి ప్రజలు హైదరాబాద్‌కు, జిల్లా కేంద్రానికి వచ్చే బదులు ప్రజావాణి సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలని ముఖ్యమంత్రి ఎంసీహెచ్ఆర్‌డీలో జరిగిన సమావేశంలో తెలంగాణ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావుతో పాటు సీఎంవో అధికారులను ఆదేశించారు.వెంటనే రెవెన్యూ డివిజన్ స్థాయిలో ప్రజావాణి ప్రారంభించాలని, తరువాత దశలో మండల స్థాయికి విస్తరించాలని సూచించారు. ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి అన్ని స్థాయిల్లో అధికారులకు పూర్తి అధికారాలు ఇవ్వాలని చెప్పారు. ప్రజలు ఇచ్చే ప్రతి ఫిర్యాదును నమోదు చేయాలని, సంబంధిత విభాగాలకు పంపించాలని, పరిష్కార పురోగతిని అర్జీదారునికి తెలియజేయాలని రేవంత్ రెడ్డి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఫిర్యాదుల పరిష్కారానికి నిర్ణీత గడువులు ఉండాలని, ఆలస్యం జరగకూడదని చెప్పారు. ఫిర్యాదుల నమోదు, ట్రాకింగ్, పరిష్కారానికి ఏకీకృత డిజిటల్ ప్లాట్‌ఫాం అభివృద్ధి చేయాలని, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో రియల్ టైమ్ మానిటరింగ్ ఉండాలని సూచించారు.ప్రతి స్థాయిలో ప్రజావాణికి ప్రత్యేకంగా నోడల్ అధికారులను నియమించాలని, ప్రతి జిల్లాలోనూ, ప్రతి శాఖలో ప్రత్యేక ప్రజావాణి విభాగాలు ఏర్పాటు చేయాలన్నారు. ఒకస్థాయిలో పరిష్కారం కాకపోతే, పైస్థాయి అధికారికి అర్జీ అందేలా ఆటో ఎస్కలేషన్ వ్యవస్థను అమలు చేయాలని చెప్పారు. అవసరమైతే అప్పీల్ వ్యవస్థను ప్రవేశపెట్టాలని సూచించారు. ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియలో ఎలాంటి రాజీ ఉండకూడదని, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో క్రమం తప్పకుండా సమీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. పెండింగ్ ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు. డ్యాష్‌బోర్డ్ ద్వారా పరిష్కార పురోగతి తెలుసుకునే వీలుండాలని, ఎక్కడైనా ఆలస్యం జరిగితే సంబంధిత అధికారులను బాధ్యులుగా చేయాలని చెప్పారు. ప్రజావాణి సేవలను వికేంద్రీకరించటంతో జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయిలో పెండింగ్ అర్జీల సంఖ్య తగ్గుతుందని, కిందిస్థాయిలోనే కొన్ని పరిష్కరించే వీలుంటుందని ముఖ్యమంత్రి గారు సూచించారు. ప్రజలకు నమ్మకంగా ఉండేలా ప్రజావాణి సేవలు అందించాలని సూచించారు.

# పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ అరాచకం : రాహుల్ గాంధీ



న్యూఢిల్లీ : పశ్చిమ బెంగాల్ లో తృణమూల్ కాంగ్రెస్ గూండాలు ఆ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కార్యకర్త దేబ్దీప్ ఛటర్జీని దారుణంగా హతమార్చారు. ఈ హత్యా ఘటనను కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా భారతదేశ అహింసా సంప్రదాయాన్ని మలినం చేసే ఈ రాజకీయాలకు తమ పార్టీ తలొగ్గదని ఆయన అన్నారు. దేబ్దీప్ మరణంతో తీవ్ర దు:ఖంలో ఉన్న ఆయన కుటుంబ సభ్యులకు రాహుల్ తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్ లో పోస్టు చేశారు. ఈ సందర్భంగా రాహుల్ 'నేడు పశ్చిమ బెంగాల్ లో ఉన్నది ప్రజాస్వామ్యం కాదు. ఇప్పటికీ టిఎంసి భయోత్పాత పాలన కొనసాగుతోంది. ఓట్లు వేసిన తర్వాత బెదిరించడం, దాడి చేయడం, ప్రతిపక్షాల గొంతును నొక్కేయడం ఇదే టిఎంసికి ప్రధాన లక్షణంగా మారింది అని రాహుల్ ఎక్స్ పోస్టులో తీవ్రంగా ఆరోపించారు.'మేము కూడా మా కార్మికులను కోల్పోయాము, అయినప్పటికీ మేము ఎల్లప్పుడూ అహింసా మార్గాన్ని, రాజ్యాంగాన్నే ఎంచుకున్నాము. ఇదే మా వారసత్వం, ఇదే మా సంకల్పం. దోషులందరినీ తక్షణమే అరెస్టు చేయాలి- అని రాహుల్ ఎక్స్ పోస్టులో టిఎంసి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే దేబ్దీప్ కుటుంబానికి పూర్తి భద్రత, నష్టపరిమారం అందించాలని ఆయన డిమాండ్ చేశారు. భారతదేశ అహింసా సంప్రదాయాన్ని మలినం చేసే ఇలాంటి రాజకీయాలకు వేము తలవంచబోము. న్యాయం జరుగుతుంది అని రాహుల్ అన్నారు.

Printed, Published and Owned by SAYED PASHA Printed at MUSKAN PRINTERS, H.No. 5-12-391/1/1, Srinivas Colony BTS Nalgonda, Dist. Nalgonda. Pin-508001, Telangana State, Published From: MUSKAN PRINTERS, H.No. 5-12-391/1/1, Srinivas Colony BTS Nalgonda, Dist. Nalgonda. Pin-508001, Telangana State.
Editor: SAYED PASHA, RNI No. RNI NO. TEITEL 2010/34557, Cell: 9849758280